CPI(M)

sangarsh
sandesh Jatha

2013 February - March

# నవ భారతం కోసం పోరాట సందేశ యాత్ర

## 2013 ఫిబ్రవరి - మార్చి

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)

**సో**దరీ సోదరులందరికీ సిపిఐ(ఎం) సంఘర్ష సందేశ యాత్ర హృదయ పూర్వకంగా స్వాగతం పలుకుతోంది.

ఈ దేశ ప్రజానీకమైన రైతులు, కార్మికులు; కార్మికుల్లో మెజారిటీగా ఉన్న అసంఘటిత కార్మికులు, హేయమైన కుల వివక్షకు, అణచివేతకు గురవుతున్న దళితులు, ఆదివాసీలు; మతతత్వ రాజకీయాలు, వివక్ష బాధితులైన మైనారిటీలు; ద్వితీయ శ్రేణి పౌరులుగా పరిగణించబడుతూ దారుణమైన లైంగిక హింసాకాండకు లక్ష్యంగా మారుతున్న మహిళలు – వీరంతా ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రత్యామ్నాయ విధానాల కోసం పోరాట సందేశాన్ని అందించేందుకు ఈ యాత్ర ఉద్దేశించబడింది. లాభాలు కాకుండా ప్రజల అభివృద్ధి కేంద్రలక్ష్యంగా కలిగిన ప్రత్యామ్నాయ అజెండాతో ఈ యాత్ర ఉంటుంది. మతతత్వ రాజకీయాలకు వ్యతిరేకంగా శ్రామిక ప్రజల ఐక్యతను రక్షించేందుకు ఈ యాత్ర పని చేస్తుంది.

ధనికులకు, విదేశీ కంపెనీలకు సబ్సిడీలను అందించి పేదలను బాధితులుగా మార్చే; ఫలితంగా సామాజిక, ఆర్థిక అసమానతల పెరుగుదలకు దారితీసే కాంగ్రెస్, బిజెపి అనుసరించే నయా ఉదారవాద ఆర్థిక విధానాలను సిపిఐ(ఎం) గట్టిగా వ్యతిరేకిస్తోంది. ఈ విధానాలు అసాధారణ రీతిలో లక్షల కోట్ల రూపాయల అవినీతికి దారితీశాయి.

మన ఆర్థిక వ్యవస్థలోని కీలక రంగాలైన బ్యాంకులు, బీమా, విద్యుత్, రక్షణ రంగాలతో పాటు విద్య, వైద్య రంగాలను కూడా సిగ్గులేకుండా ప్రయివేటు రంగానికి అప్పగించే; విలువైన ఆస్తులున్న ప్రభుత్వ రంగ సంస్థలను విదేశీ, స్వదేశీ కార్పొరేట్ సంస్థలకు తెగనమ్మటం ద్వారా మన దేశాన్ని, దాని సార్వభౌమత్వాన్ని దెబ్బతీసే ప్రభుత్వ విధానాలను సిపిఐ(ఎం) వ్యతిరేకిస్తోంది. దేశ సహజ వనరులైన బొగ్గు, ఇనుపఖనిజం తదితరాలను కూడా విదేశీ దోపిడీకి, బడా గనుల కంపెనీల లూటీకి అప్పగించటమే కాదు, ఆ ప్రాంతాలలోని ఆదివాసీల హక్కులను కూడా కాలరాస్తున్నారు. దాదాపు ఐదుకోట్లమంది జీవనాధారాన్ని దెబ్బతీసే విధంగా చిల్లర దుకాణాల రంగంలో వాల్‌మార్ట్ వంటి బడా కంపెనీలను అనుమతించనున్నారు.

ఈ విధానాలు పేదలు, ధనికుల మధ్య అంతరాలను నేరుగా మరింత పెంచనున్నాయి. ఐదువేల కోట్ల రూపాయలకు పైబడిన ఆస్తులు గల వ్యక్తులు 2003లో 13 మంది ఉంటే 2011 నాటికి 55కు, 2012 అక్టోబరు నాటికి 61కి పెరిగారు. కేవలం ఒక్క ఏడాదిలోనే 2011-12 మధ్య వంద మంది ధనికుల ఆస్తులు 241 బిలియన్ డాలర్ల (రు.13,25,500 కోట్లు) నుంచి 250 బిలియన్ డాలర్లకు (రు.13,75,000 కోట్లు) పెరిగాయి. మరోవైపు 86.3కోట్ల మంది ప్రజలు రోజుకు 20 రూపాయల లోపే ఖర్చు చేసే స్థితిలో ఉన్నారు. అప్పులు తీవ్రమైన కారణంగా 1995 నుంచి ఇప్పటివరకు 2.90 లక్షల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు.

దేశ జాతీయ సంపదల వినియోగంలో సమానత్వం కోసం పోరాటాలను బలపరిచేందుకు ఈ యాత్ర ఉద్దేశించబడింది. సామాజిక అసమానతలను తొలగించేందుకు మెజారిటీ ప్రజానీకపు అవసరాలకు ఈ సంపదలను వినియోగించాలి.

ప్రజా సంక్షేమానికి కీలకమైన దిగువ డిమాండ్లను సంఘర్ష సందేశ యాత్ర ముందుకు తెస్తోంది.

**ఆహార హక్కు,**

**విద్యా, ఉపాధి హక్కు,**

**ఆరోగ్య సౌకర్యాలు, చౌక ఔషధాల హక్కు,**

**ఇళ్ల స్థలాలు, భూసంస్కరణల హక్కు,**

**కుల, మత, లింగ ప్రాతిపదికన వివక్ష లేకుండా స్వేచ్ఛగా జీవించే హక్కు.**

## ఇళ్ల స్థలాలు, భూసంస్కరణల హక్కు

మన దేశంలో సీలింగ్ చట్టాన్ని ఉల్లంఘించి దాచుకున్న మిగులు భూమి 2.1 కోట్ల ఎకరాలు ఉందని అంచనా వేయబడింది. అయితే కేవలం 27 లక్షల ఎకరాలు మాత్రమే మిగులుగా ప్రకటించారు, 19 లక్షల ఎకరాలను మాత్రమే పంచారు. ఈ మొత్తంలో పశ్చిమ బెంగాల్ వామపక్ష సంఘటన ప్రభుత్వం పంచిన మొత్తం ఎక్కువగా ఉండటాన్ని గమనించాలి. భూమిలేని నిరుపేద కుటుంబాలు దేశంలో 1992లో 22శాతం ఉండగా 2011 నాటికి 41శాతానికి పెరిగాయి.

కనీసం ప్రతి కుటుంబానికి ఒక ఇళ్ల స్థలం పంపిణీ చేయటాని కన్నా కార్పొరేట్ మరియు గనుల కంపెనీల కోసం బలవంతంగా భూమి సేకరించేందుకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తున్నది. బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా జరిగే పోరాటాలకు సిపిఐ(ఎం) మద్ధతిస్తున్నది. రాజ్యాంగం హామీ ఇచ్చిన ఐదవ షెడ్యూలు,'పెసా'లను ఉల్లంఘించి ఆదివాసీలను వారి నివాస ప్రాంతాలనుంచి తొలగించటాన్ని గట్టిగా వ్యతిరేకిస్తున్నది.

భూమి లేని పేదలకు భూమి, ఇళ్ల స్థలాలను పంపిణీ చేయాలని సిపిఐ(ఎం) డిమాండ్ చేస్తున్నది. భూ గుత్తాధిపత్యాన్ని బద్దలు కొట్టేందుకు పోరాటాలు జరపాలని పిలుపునిస్తున్నది. బలవంతంగా రైతుల, ఆదివాసుల భూముల బలవంతపు సేకరణకు వ్యతిరేకంగా వారి ప్రయోజనాలను రక్షించేందుకు కట్టుబడి ఉంది. భూమి ఇచ్చేందుకు అంగీకరించిన రైతులందరికీ మాత్రమే కాకుండా, దానిపై జీవనం కోసం ఆధారపడిన వ్యవసాయ కార్మికులు, కౌలుదార్లకూ పూర్తి స్థాయిలో పరిహారం, పునరావాసం కోసం పోరాడుతుంది. దేశంలోని ప్రతి కుటుంబానికి ఇళ్ల స్థలం ఇవ్వాలని కోరుతోంది.

## ఆహార హక్కు

ప్రపంచం మొత్తం మీద పోషకాహారం లేని అత్యధిక మంది జనం ఉన్న దేశం మనది. ఆహార హక్కు ఎంతో కీలకమైనది, మన పౌరుల కనీస హక్కు అది. ప్రపంచ ఆకలి సూచికలో 78దేశాలలో నేపాల్, పాకిస్థాన్ తరువాత 65వ స్థానంలో మన దేశం ఉండటం సిగ్గు చేటు. అయినప్పటికీ ప్రజలకు ఆహార హక్కును నిరాకరిస్తూ ఎపిఎల్, బిపిఎల్ అని విడదీస్తున్న అన్యాయమైన పంపిణీ వ్యవస్థ కొనసాగాలని ప్రభుత్వం పట్టుబడుతున్నది. ప్రభుత్వ ప్రకటనల ప్రకారం రోజుకు గ్రామాల్లో 26, పట్టణాలలో 32 రూపాయల కంటే ఎక్కువ ఆదాయం పొందే వారు పేదలు కారు, వారు చౌక ధరలకు ఇచ్చే ఆహార పదార్థాలకు అనర్హులు. ఇదంతా 6.67 కోట్ల టన్నుల ఆహార ధాన్యాలు గోడౌన్లలో పుచ్చిపోతున్న సమయంలో జరుగుతున్నది. వీటిని పంపిణీ చేయాలని సుప్రీం కోర్టు సూచించినప్పటికీ ప్రభుత్వం తిరస్కరిస్తోంది.

అత్యవసర సరుకుల ధరలను నియంత్రించటంలో ఈ ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. ప్రభుత్వ లోపభూయిష్ట విధానాల కారణంగా ప్రతి సంవత్సరం ధరలు పెరుగుతున్నాయి. వ్యవసాయ సరుకుల వాణిజ్యంలో ముందస్తు వ్యాపారానికి అనుమతించి సట్టా వ్యాపారానికి దారులు తెరవటం, పెట్రోలు, డీజిల్, కిరోసిన్‌లకు సబ్సిడీలను తగ్గించి తరచూ ధరలను పెంచడం వంటి విధానాలు దీనికి కారణం. ఇప్పుడు రాయితీ సిలిండర్ల సంఖ్యను తగ్గించటమే కాదు మూడు సార్లు ధరలను పెంచింది. బియ్యం, గోధుమలు, పంచదార, వంటనూనెలు, పప్పుల ధరలు 20 నుంచి 30శాతం పెరిగాయి. కూరగాయల ధరలు సైతం పెరిగాయి.

ప్రజల వత్తిడి మేరకు ప్రభుత్వం ఆహార భద్రత బిల్లును రూపొందించింది. దారిద్ర్యరేఖ దిగువ కార్డుదారులకు 35కిలోల కన్నా తగ్గించటమే కాకుండా ఆ బిల్లు ప్రతిపాదించిన పంపిణీ వ్యవస్థలో తీవ్రమైన లోపాలు ఉన్నాయి. ఎపిఎల్, బిపిఎల్ విభజనను ఇది కొనసాగిస్తున్నది. ఆహార ధాన్యాలకు బదులు నగదు సబ్సిడీని ప్రోత్సహించేదిగా అది ఉంది. ఆ ఇచ్చే నగదు మార్కెట్ ధరలకు సరిపోయేదిగా ఉండదు. అందువలన 35 కిలోల ఆహార ధాన్యాలు గణనీయంగా తగ్గిపోతాయి.

అత్యవసర సరుకులు, ఆహార ధాన్యాల ధరలు పెరగకుండా చూసేందుకు వాటి వ్యాపారంలో ముందస్తు వ్యాపారాన్ని అనుమతించకూడదని సిపిఐ(ఎం) డిమాండ్ చేస్తోంది. నియంత్రణ ధరల వ్యవస్థను పునరుద్ధరించి పెట్రోలు, డీజిల్ ధరలను తగ్గించాలి. దారిద్ర్యంపై తప్పుడు అంచనా పద్ధతుల ఆధారంగా రూపొందించిన ఎపిఎల్, బిపిఎల్ వ్యవస్థను రద్దు చేసి అందరికీ ఆహార భద్రతను కల్పించాలని పార్టీ కోరుతోంది. గరిష్టంగా కిలో రెండు రూపాయల వంతున 35 కిలోల ఆహార ధాన్యాలను అందించాలని డిమాండ్ చేస్తోంది. ప్రభుత్వం వద్ద ఉన్న భారీ ఆహార నిల్వలను పౌరులకు తక్షణం పంపిణీ చేయాలని కోరుతోంది.

## విద్య, ఉపాధి హక్కు

జనాభాలో పాతికేళ్ల లోపు యువతీయువకులు సగం మంది ఉన్నారు. అందువలన మన యువతరానికి కీలకమైన అవకాశాలను ప్రభుత్వం కల్పించటంపై దేశ అభివృద్ధి ఆధారపడి ఉంది. అయితే విద్యా హక్కు, అదే విధంగా ఉపాధి అవకాశాల విషయంలో ప్రభుత్వ రికార్డు సిగ్గుపడే విధంగా ఉంది.

ప్రభుత్వం 2009లో విద్యా హక్కు చట్టాన్ని చేసింది. అంటే ఇప్పుడు ప్రతి బిడ్డా స్కూలులో ఉండాలి. అయితే ఈ చట్టాన్ని అమలు చేయాలంటే ఎన్నో స్కూళ్లను నిర్మించటంతో పాటు 14లక్షల మంది టీచర్లను నియమించవలసి ఉంది. కానీ కేంద్ర ప్రభుత్వం అవసరమైన నిధులను అందచేసేందుకు తిరస్కరిస్తోంది. ఇప్పటికే ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న రాష్ట్రాలపై ఆ బాధ్యతను వదలివేస్తోంది. ఒకటవ తరగతిలో చేరిన వారిలో నేడు కేవలం 16శాతం మంది పిల్లలే 12వ తరగతి వరకు వెళుతున్నారు. ఆర్థిక కారణాలతో ఎక్కువ మంది మధ్యలో స్కూలు మానివేస్తున్నారు. షెడ్యూలు కులాలు, తరగతుల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. స్కాలర్‌షిప్పుల మొత్తాన్ని పెంచకపోవటం, వారుండే హాస్టళ్లు దుర్భరంగా ఉంటున్నందున స్కూలు మానివేయాల్సిన స్థితికి నెట్టబడుతున్నారు. ఉన్నత విద్యా రంగం రికార్డులో మన దేశ పరిస్థితి మరింత సిగ్గుపడే విధంగా ఉంది. పన్నెండవ తరగతి పూర్తిచేసిన వందమందిలో 90 మంది కాలేజీకి వెళ్లలేని స్థితి. ఉన్నత విద్యకు అవకాశాలను పెంచటానికి బదులు ప్రయివేటు రంగాన్ని ప్రోత్సహించటం ద్వారా దాన్ని మరింత ఉన్నత తరగతులకు అందుబాటులో ఉంచుతున్నది, లాభాలను తెచ్చే ఒక అవకాశంగా చేస్తున్నది.

కార్పొరేట్లను, విదేశీ పెట్టుబడులను ఉన్నత విద్యలో అనుమతించేందుకు, తన ప్రయివేటీకరణ అజెండాను మరింత ముందుకు తీసుకుపోయేందుకు కేంద్ర ప్రభుత్వానికి అవకాశాలు కల్పించే ఆరు బిల్లులు పార్లమెంట్ ముందు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రస్తుతం ఉన్న మూడుశాతం మొత్తాన్ని జిడిపిలో ఆరుశాతం ఉండే విధంగా

విద్యకు కేటాయించాలని సిపిఐ(ఎం) ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తోంది. విద్యా హక్కు చట్టాన్ని పూర్తిగా అమలు జరపాలని కోరుతోంది. ఉన్నత విద్యారంగంలో ఎఫ్‌డిఐలు, కార్పొరేట్ల ప్రవేశాన్ని వ్యతిరేకిస్తోంది.

## ఉపాధి హక్కు

ఆర్థిక ప్రగతి గురించి ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోంది. అయితే ఆ ప్రగతి ఉద్యోగాలను కల్పించేదిగా లేదు. కొన్ని సందర్భాలలో అది ఉపాధి రహితమైతే మరికొన్ని సందర్భాలలో ఉపాధికి నష్టదాయకమైనదిగా ఉంటోంది. ఉదాహరణకు 1998లో సంఘటితరంగంలో 2.82 కోట్ల మంది ఉద్యోగాలు చేస్తున్నారు. అయితే 2008 నాటికి ఈ సంఖ్య 2.75 కోట్లకు తగ్గిపోయింది. అంటే ఏడు లక్షల ఉద్యోగాలను నష్టపోయినట్లు. వార్షిక ఉపాధి పెరుగుదల రేటు 2000-05 సంవత్సరాలలో 2.7శాతం నుండి 2005-10 నాటికి 0.8శాతానికి పడిపోయింది. యువతరంలో నిరుద్యోగం ముఖ్యంగా యువతుల్లో ఎక్కువగా ఉంది.

కేంద్ర ప్రభుత్వంలో ఇప్పటికీ పదిలక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. రైల్వేలో ఎక్కువగా 2.2 లక్షల ఖాళీలున్నాయి. ఈ ఖాళీల్లో సగం షెడ్యూలు కులాలు, తరగతులు, ఒబిసిలకు చెందినవే. ఉద్యోగ నియామకాలపై నిషేధం కారణంగా ఈ ఖాళీలు ఉన్నాయి. ఇదే సమయంలో కాంట్రాక్టు, క్యాజువల్ పద్ధతిలో ఉద్యోగాలు కల్పిస్తున్నారు. సర్వీసుకు, వేతనాలు, ఇతర ప్రయోజనాలకు గ్యారంటీ లేదు. ప్రయివేటు రంగంలో కాంట్రాక్టు కార్మికులు 80శాతం మంది వరకు ఉన్నారు. చివరకు ప్రభుత్వ రంగ సంస్థలలో కూడా 50శాతం మంది కాంట్రాక్టు పద్ధతిలో పనిచేయాల్సిన పరిస్థితి. దుర్భరమైన పరిస్థితుల్లో ఎలాంటి హక్కులు లేకుండా ఇలాంటి వారు దాదాపు ఐదు కోట్ల మంది ఉంటారని అంచనా.

ముస్లిం సామాజిక తరగతికి చెందిన వారి పట్ల వివక్ష కారణంగా ప్రభుత్వ, ప్రవేటు రంగం లేదా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వోద్యోగాలలో చాలా తక్కువ మంది ముస్లిములు ఉన్నారు. గ్రామీణ ప్రాంతాలలో జాతీయ గ్రామీణ ఉపాధి పథకానికి గణనీయంగా నిధుల కోత విధిస్తున్నారు. గత బడ్జెట్‌లో ఈ పథక నిధులలో పెద్ద మొత్తాన్ని ఖర్చు చేయలేదు. చట్టం గ్యారంటీ చేసిన వంద రోజుల్లో సగటున సగం కంటే తక్కువే పని చూపారు.

ప్రభుత్వ ఉద్యోగ నియామకాలపై నిషేధం ఎత్తివేయటంతో పాటు ఉద్యోగాలలో ఎస్‌సి,ఎస్‌టి, ఒబిసి తరగతుల బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి వెంటనే చర్యలు తీసుకోవాలని సిపిఎం డిమాండ్ చేస్తోంది. మహిళలకు మూడోవంతు రిజర్వేషన్, కనీస వేతనాల హామీతో పట్టణ ఉపాధి పథకాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తోంది. ముస్లిం రిజర్వేషన్లకు రంగనాథ్ మిశ్రా కమిటీ సిఫార్సులను అమలు చేయాలని డిమాండ్

చేస్తోంది. జాతీయ గ్రామీణ ఉపాధి పథకం పరిధిని పెంచి 100 రోజుల పరిమితిని ఎత్తివేసి కనీస వేతనాలతో మరింత ఎక్కువగా పథకాన్ని అమలు జరపాలని డిమాండ్ చేస్తోంది.

## ఆరోగ్యం, చౌక ఔషధాల హక్కు

దేశంలో ఆరోగ్య సేవల కోసం నానాటికీ ప్రయివేటు రంగంపై ఆధారపడటం ఎక్కువైంది. అది వైద్యులు, క్లినిక్కులు, ఆసుపత్రులు, ఔషధాలు ఏదైనా కావచ్చు. పౌరుల అనారోగ్యం ఆసరాగా లాభాలు దండుకోవడంపై ఎలాంటి నియంత్రణ, అదుపు లేదు. అందువలననే గత ఇరవై సంవత్సరాల నయాఉదారవాద విధానాల్లో ఆరోగ్య సంబంధ ప్రయివేటు పరిశ్రమ మొత్తం పరిశ్రమల్లో అత్యంత లాభదాయ కమైందిగా మారింది. మరోవైపున కుటుంబాలు అప్పులపాలు గావటానికి రెండో ప్రధాన కారణంగా ఆరోగ్య ఖర్చులున్నాయని అంచనావేయబడింది. ఈ ఖర్చు లక్షలాది కుటుంబాలను దారిద్ర్యంలోకి నెడుతోంది.

అందరికీ ఆరోగ్య సేవలు అందించాల్సిన జాతీయ గ్రామీణ ఆరోగ్య కార్యక్రమాన్ని ప్రభుత్వమే స్వయంగా దెబ్బతీస్తున్నందున ఆ లక్ష్యం సుదూరంగా ఉంది. ప్రాధమిక ఆరోగ్య సంరక్షణ కేంద్రాలను పటిష్టపరచటం ద్వారా ప్రభుత్వ ఆరోగ్య సేవలు అందరికీ అందుబాటులోకి రావాల్సి ఉండగా కేంద్ర ప్రభుత్వం అందుకు అవసరమైన నిధులను అందచేసేందుకు తిరస్కరించింది. వాగ్దానం చేసినట్లు కనీసం జిడిపిలో ఐదు శాతం బదులు కేవలం ఒకశాతం మాత్రమే ఆరోగ్యసేవలపై ఖర్చు చేస్తున్నారు. ప్రభుత్వ ఖర్చుకు మారుగా ప్రయివేటు ఆసుపత్రులు, వైద్యులపై ఆధారపడే బీమా పద్ధతిని ప్రభుత్వం ముందుకు తెస్తోంది. పరిమితమైన ఆరోగ్య బీమా పథకాల ద్వారా ప్రజల సొమ్మును ప్రయివేటు కంపెనీలకు అప్పగిస్తున్నారు. ఆసుపత్రిలో చేరినప్పుడు మాత్రమే వర్తించే ఈ పథకాలు పేదల ఆరోగ్య ఖర్చులను పూర్తిగా తీర్చలేవు.

నేడు దేశంలో మౌలిక సదుపాయాలు లేమి పెద్ద సంఖ్యలో మరణాలకు దారితీస్తోంది. వాటిని అరికట్టవచ్చు. ఉదాహరణకు, గ్రామీణ ఆరోగ్య సేవలు లేని కారణంగా ప్రతి పదినిమిషాలకు ఒక మహిళ ప్రసూతి మరణానికి గురవుతున్నది. పోషకాహార లోపం లేదా వ్యాధుల కారణంగా ఐదేళ్ల లోపు పిల్లలు ప్రతి గంటకు 218 మంది మరణిస్తున్నారు.

ఈశాన్య ప్రాంతాలు, మరియు గిరిజన ప్రాంతాలలో ఇప్పటికీ మలేరియా వేలాది మంది ముఖ్యంగా నిరుపేదల ప్రాణాలు తీస్తోంది. పారిశుధ్య సౌకర్యాల లేమి అదే మాదిరి రక్షిత మంచినీటి సౌకర్యం లేని కారణంగా నీటి సంబంధిత వ్యాధులు పెరుగుతున్నాయి. అందువలన రక్షిత మంచినీటి, పారిశుధ్య సౌకర్యాల హక్కులతో పాటు ఆరోగ్య హక్కు కూడా కీలకమైనదే.

జనాభా లెక్కల ప్రకారం దేశంలోని 33 కోట్ల కుటుంబాలలో 57శాతానికి నేడు నల్లాల ద్వారా అందే నీటి సౌకర్యం లేదు, 37శాతం మందికి వంటగది సౌకర్యం లేదు, 53శాతం మందికి మరుగుదొడ్లు లేవు.

అత్యవసర ఔషధాల ధరలు విపరీతంగా పెరిగాయి. దీనికి ప్రధానంగా ఔషధ పరిశ్రమను బడా బహుళజాతి గుత్త కంపెనీలు, కార్పొరేట్ కంపెనీలు ఇప్పుడు అదుపు చేయటమే. ఐదు అతి పెద్ద ఔషధ కంపెనీలలో మూడు బహుళజాతి సంస్థలే. అతిపెద్ద ఎత్తున లాభాలు ఆర్జిస్తున్నాయి. అత్యవసర ఔషధాల ధరలను నియంత్రించటానికి బదులు ప్రభుత్వం కంపెనీల అనుకూల విధానాలను అనుసరిస్తున్నది. ఆరోగ్య సేవలకు బడ్జెట్ కేటాయింపులను పెంచాలని సిపిఐ(ఎం) డిమాండ్ చేస్తున్నది. ప్రయివేటు వైద్య రంగంపై కఠినమైన నియంత్రణ అమలు జరపాలని కోరుతున్నది. అత్యవసర ఔషధాలపై నియంత్రణ ఉండాలని డిమాండ్ చేస్తున్నది. మంచి ఆరోగ్యానికి కీలకం మన పౌరుల జీవన స్థితిగతులను మెరుగు పరచటమని సిపిఐ(ఎం) భావిస్తోంది.

## సామాజిక న్యాయం కోసం

షెడ్యూలు కులాలు, తెగలు, మైనారిటీలు, మరియు మహిళల సామాజిక న్యాయ వేదికలకు మద్దతుగా పౌరులందరూ ముందుకు రావాలని ఈ సంఘర్ష సందేశ జాతా ద్వారా సిపిఐ(ఎం) విజ్ఞప్తి చేస్తున్నది. ఈ తరగతులు అభివృద్ధి చెందకుండా ఏ దేశమూ ముందుకు పోజాలదు. మౌలిక వర్గాలైన  కార్మికులు, రైతులతో కూడిన వెన్నెముక వంటి ఈ తరగతులు ఇతర శ్రామిక జీవులందరితో పాటు ఆర్థిక దోపిడీకి గురికావటమే గాక సామాజిక వివక్ష భారానికి కూడా గురి అవుతున్నారు.

సాధారణంగా మహిళలు మరియు ముఖ్యంగా  కార్మిక పేదల్లో మహిళలు అత్యంత దారుణ మైన లైంగిక దాడులకు లక్ష్యాలుగా ఉన్నారు. వివక్ష, హింస నుంచి మహిళలకు స్వేచ్ఛ, సమానత్వం కోసం జరిగే పోరాటానికి ఈ సంఘర్ష సందేశ జాతా సౌహార్ద్రత ప్రకటిస్తున్నది.

## అవినీతిని నిరోధించండి

అవినీతి రాజకీయవేత్తలు, ఉన్నతాధికారులు, కార్పొరేట్ల ప్రమాదకర కుమ్మక్కుకు ప్రభుత్వ విధానాలు దోహదం చేస్తున్నాయి. అవినీతితో లక్షల కోట్ల రూపాయల లూటీ జరుగుతోంది. కేవలం 2జి, బొగ్గు కుంభకోణాలతోనే  ఖజానా 3.56 లక్షల కోట్ల రూపాయలను కోల్పోయింది. కామన్‌వెల్త్ ఆటలు, భూ, గనుల కుంభకోణాలు దీనికి అదనం అని గ్రహించాలి. గనుల కుంభకోణాలలో ఎక్కువ భాగం బిజెపి హయాంలో కర్ణాటక, మధ్యప్రదేశ్, జార్ఖండ్లలో జరిగాయి.

గత దశాబ్దిలో మన దేశం నుంచి అక్రమంగా 5.7లక్షల కోట్ల రూపాయలను తరలించినట్లు అంచనా. మన పౌరులకు చెందిన ఈ సొమ్మును పన్ను ఎగవేతదారులు, నల్లధనం దాచుకున్న వారు స్విట్జర్లాండ్ ఇతర విదేశీ బ్యాంకులలో నిలవచేశారు. ప్రభుత్వం ఈ సొమ్మును వెనక్కు తీసుకురావటానికి లేదా నేరస్థులకు వ్యతిరేకంగా ఎలాంటి చర్య తీసుకొనేందుకు ముందుకు రావటం లేదు. ధనికుల నుంచి పెద్ద మొత్తంలో రావాల్సిన పన్ను బకాయిలను కూడా గుర్తించారు. దేశంలో అవినీతి విచ్చలవిడిగా ఉంది. అయినప్పటికీ ప్రభుత్వం బలమైన లోక్‌పాల్ బిల్లు తేవటానికి తిరస్కరిస్తోంది. ప్రభుత్వం ప్రతిపాదించిన బిల్లు ప్రకారం ప్రభుత్వం అదుపును కలిగి ఉంటుంది. ఇది దేశ ప్రజా ప్రయోజనాలకు వ్యతిరేకం. అవినీతిని అంతం చేయాలని బలమైన లోక్‌పాల్ చట్టాన్ని చేయాలని ఈ జాతా డిమాండ్ చేస్తోంది. ఇదే సమయంలో అవినీతి మన దేశంలో ప్రజాస్వామ్య పనితీరును దెబ్బతీస్తున్నది. ఎన్నికల ప్రక్రియను అపహాస్యం చేసే విధంగా కోట్లాది రూపాయల నల్ల ధనం ఖర్చు చేస్తున్నారు. ప్రజాస్వామిక ప్రక్రియను రక్షించేందుకు డబ్బుప్రభావాన్ని తగ్గించే విధంగా ఎన్నికల సంస్కరణలు తేవటం తక్షణ అవసరం.

## భవిష్యత్ మార్గం

డబ్బు లేదనే పేరుతో ప్రజల డిమాండ్లను ప్రభుత్వం తిరస్కరించింది. పేదలకు సబ్సిడీల కోత పెడుతున్న ప్రభుత్వం ధనికులకు సబ్సిడీలు ఇచ్చేందుకు ప్రాధాన్యత ఇస్తోంది. 2009 నుంచి ఇంత వరకు 20 లక్షల కోట్ల రూపాయల పన్ను రాయితీలను ప్రభుత్వం ఇచ్చింది. ఈ మొత్తంలో ప్రధానంగా లబ్ధి పొందింది ధనికులే.

దేశంలో వనరులకు కొరత లేదు. వీటిని ధనికులకు అనుకూలంగా వినియోగిస్తున్న కారణంగా పేదల మౌలిక హక్కులకు భంగం కలుగుతోంది. ధనికులకు పన్ను రాయితీలను నిలిపివేయాలని మేము డిమాండ్ చేస్తున్నాము. అవినీతి పరులను శిక్షించాలని, వారి నుంచి జరిగిన నష్టాలను రాబట్టాలని కోరుతున్నాము. స్విస్ బ్యాంకుల్లో దాచిన సొమ్మును వెనక్కు తేవాలని డిమాండ్ చేస్తున్నాము. ఆ సొమ్మును పౌరుల మౌలికమైన జీవించే హక్కు అమలుకు వినియోగించాలని డిమాండ్ చేస్తున్నాము.

## ముగింపు

దేశం నాలుగు మూలల నుంచి నాలుగు సంఘర్ష సందేశ జాతాలు నడుస్తున్నాయి. ఇవి దాదాపు అన్ని రాష్ట్రాల నుంచి ప్రయాణిస్తాయి. అనేక గ్రామాలు, పట్టణాల నుంచి చిన్న జాతాలు వీటికి తోడవుతాయి. ఇవన్నీ మార్చి 19న ఢిల్లీలో మహాప్రదర్శనగా ఏకమౌతాయి. ఈ యాత్రలు ప్రజల ఐక్యతకు చిహ్నం. వారి మౌలిక

హక్కుల కొరకు, మతతత్వానికి వ్యతిరేకంగా, లౌకికత్వం కొరకు కృషి చేస్తాయి. కాంగ్రెస్, బిజెపి అనుసరిస్తున్న వినాశకర ఆర్థిక విధానాలను ఉపసంహరించాలని డిమాండ్ చేస్తాయి.

## తక్షణ డిమాండ్లు

**భూమి, నివాస స్థల హక్కు :** భూసంస్కరణలు అమలు జరిపి మిగులు భూములను భూమిలేని పేదలకు పంచాలి. ప్రతి పేద కుటుంబానికి ఇంటి స్థలాన్ని ఇవ్వాలి.

**ఆహార హక్కు :** గరిష్టంగా కిలో రెండు రూపాయల వంతున అందరికీ కనీసంగా 35 కిలోల బియ్యం ఇవ్వాలి. తప్పుడు దారిద్ర్య లెక్కల విధానాల ప్రాతిపదికన చేసిన ఎపిఎల్, బిపిఎల్ విభజన రద్దు చేయాలి.

**విద్య, ఆరోగ్య హక్కు :** విద్య, ఆరోగ్య సేవల ప్రయివేటీకరణను నిలిపివేయాలి. విద్య, వైద్యానికి కేటాయింపులను పెంచాలి. విద్యా హక్కు చట్టం అమలుకు హామీ ఇవ్వాలి. పౌర ఆరోగ్యసేవలను పటిష్టపరచాలి. ప్రయివేటు రంగంపై కఠిన నియంత్రణ అమలు జరపాలి.

**ఉపాధి హామీ హక్కు :** ఉద్యోగాల కల్పనకు ప్రభుత్వ పెట్టుబడులను పెంచాలి. అన్ని ఖాళీలను ఒక నిర్ణీత కాల వ్యవధిలో భర్తీ చేసే విధంగా నిషేధాన్ని ఎత్తివేయాలి ముఖ్యంగా ఎస్సి,ఎస్టి, ఒబిసి బ్యాక్‌లాగ్ ఖాళీలను భర్తీ చేయాలి. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పని రోజులను పెంచాలి. ధరల సూచికతో ముడిపడిన కనీస వేతనాలను ఇవ్వాలి. పథకాన్ని విస్తరించి పట్టణ ప్రాంతాలలో గ్యారంటీ పని దినాలను కల్పించాలి.

**అవినీతిని అంతమొందించాలి :** దర్యాప్తునకు స్వతంత్ర అధికారాలు కలిగిన లోక్‌పాల్ వ్యవస్థతో చట్టాన్ని చేయాలి. విదేశీ బ్యాంకుల్లో దాచుకున్న సొమ్మును వెనక్కు తేవాలి. నష్టాలకు కారణమైన కార్పొరేట్లనుంచి సొమ్మును రాబట్టాలి. అవినీతి పరులను జైళ్లకు పంపాలి.

## <u>మీ అందరికీ మా విన్నపం</u>

- **ప్రత్యామ్నాయ విధానాల పోరులో చేరండి**
- **మౌలిక హక్కుల పోరాటంలో చేరండి**
- **సామాజిక న్యాయ పోరాటంలో చేరండి**

## అనుబంధం :

# 1. అవినీతిని నిరోధించాలి

**అ**వినీతికి పాల్పడే రాజకీయవేత్తలు, అధికారులు, కార్పొరేట్లు విషపూరితంగా పెనవేసుకోవడానికి ప్రభుత్వ విధానాలు దోహదపడ్డాయి. లక్షల కోట్ల ప్రజాధనం లూటీకి ఈ అవినీతి కారణమయింది. గత రెండు దశాబ్దాలుగా అమలవుతున్న నయా ఉదారవాద విధానాలు ధనిక పేద తారతమ్యాలను తీవ్రం చేయడమే కాకుండా, ప్రజాధనం లూటీని అనేక రెట్లు పెంచాయి. నయా ఉదారవాద సమర్ధకులు చెపుతున్న దానికి భిన్నంగా భారీగా పోగుపడిన 'నల్ల ధనం' అవినీతి ఫలితమే. జిఎఫ్ఐ 2010 నివేదిక ప్రకారం, దేశ జిడిపిలో 50 శాతం 'ప్రచ్ఛన్న (నల్ల) ఆర్థికవ్యవస్థ'గా నడుస్తున్నది.

ఇంత వేగంగా పెరిగిన ప్రచ్ఛన్న ఆర్థిక వ్యవస్థ ఒక పర్యవసానం భారీ మొత్తాలలో డబ్బు విదేశాలకు పయనించడం. అందుచేతనే పన్ను స్వర్గధామాలకు, సీమాంతర ఖాతాలకు అక్రమంగా నిధులు తరలిపోయాయి. ఈ విధంగా తరలించబడిన మొత్తాలు సంస్కరణలకు ముందు కన్నా ఆ తర్వాత కాలంలో ఐదు రెట్లు అధికమయ్యాయి.

భారతీయులు విదేశాలలో నిల్వచేసుకున్న మొత్తాలు 0.5 ట్రిలియన్ డాలర్లు (రు. 25 లక్షల కోట్లు) నుండి 1.4 ట్రిలియన్ డాలర్లు (రు. 70 లక్షల కోట్లు) ఉంటాయని అంచనా. భారత ప్రజల సొమ్మును పన్ను దొంగలు అక్రమంగా తరలించి స్విస్ బ్యాంకుల్లోను, ఇతర విదేశీ బ్యాంకుల్లోను దాచుకుంటున్నారు. ఈ సొమ్మును వెనక్కి తీసుకు రావడానికి కాని, అక్రమానికి పాల్పడ్డ వారిపై చర్యలు తీసుకోవడానికి కాని ప్రభుత్వం పూనుకోవడం లేదు. విదేశాలలో భారతీయులు దాచిపెట్టిన సొమ్ము వివరాలను, వారి పేర్లను విదేశీ బ్యాంకులు, బ్యాంకింగ్ సంస్థలు తెలియచేసినా, భారత ప్రభుత్వం వాటిని బయటపెట్టడానికి అంగీకరించడం లేదు.

సంస్కరణల కాలంలో చోటుచేసుకున్న అనేక కుంభకోణాలు ఈ ప్రచ్ఛన్న ఆర్థిక వ్యవస్థ పెరగడానికి పెద్దఎత్తున దోహదపడ్డాయి. ప్రభుత్వ నియంత్రణల వల్లనే అవినీతి పెరుగుతుందని నయా ఉదారవాద సిద్ధాంతవేత్తలు చెబుతుంటారు. గతంలో చిన్న చిన్న కుంభకోణాలు నియంత్రణలు ఎత్తివేసిన తర్వాత మెగాస్కాములుగా రూపుదాలుస్తున్నాయి. పైగా పదే పదే చోటుచేసుకుంటున్నాయి. బోఫోర్స్ కుంభకోణం

కేవలం రు.64 కోట్లు మాత్రమే. కాని 2జి కుంభకోణం రు.1.76 లక్షల కోట్లు అని కాగ్ అంచనా వేసింది. బొగ్గు కుంభకోణం వల్ల ప్రభుత్వ ఖజానాకు రు.1.86 లక్షల కోట్ల నష్టం వాటిల్లింది. కెజిబేసిన్‌లో రిలయన్స్‌కు ధరలు పెంచుకోవడంలో కల్పించిన రాయితీలవల్ల రు.లక్ష కోట్లు నష్టం వాటిల్లింది. కామన్‌వెల్త్ క్రీడల స్కాము సుమారు రు.60,000 కోట్లు. 2జి స్కాములో డి రాజా తనకు ఇష్టమైన 122 మందికి లైసెన్సులు మంజూరు చేశాడు. వీరిలో రియల్ ఎస్టేట్ సంస్థ యూనిటెక్, రిలయన్స్ లాంటి వాటికి మార్కెట్ విలువలో పదో వంతుకు లైసెన్స్‌లు కట్టబెట్టారు. చివరికి సుప్రీం కోర్టు ఈ లైసెన్సుల మంజూరును రద్దు చేసి, తిరిగి వేలం నిర్వహించాలని ఆదేశించింది. అసలుకుంభకోణాన్ని సమర్థించుకోవడానికి యుపిఏ ప్రభుత్వం నేడు ఈ వేలాన్ని దెబ్బతీయాలని ప్రయత్నిస్తున్నది.

కెజి బేసిన్ రిలయన్స్ కేసులో రెండు కుంభకోణాలున్నాయి. ఒకటి కెజి బేసిన్ గ్యాస్ ధరకు సంబంధించినది. రిలయన్స్ ఈ ధరను ఒక ఎంఎంబిటియుకు 2.34 డాలర్లనుండి 4.2 డాలర్లకు అడ్డగోలుగా పెంచేసింది. దీనివల్ల ప్రభుత్వ ఖజానాకు రు.50,000 కోట్ల నష్టం వాటిల్లింది. రెండవది, ఉత్పత్తి సామర్థ్యాన్ని కేవలం రెండు రెట్లు పెంచితే, క్యాపిటల్ కాస్ట్‌ను నాలుగు రెట్లు 2.2 బిలియన్ డాలర్ల నుండి, 8 బిలియన్ డాలర్లకు పెంచడానికి ప్రభుత్వం అనుమతించడం. కాని ఆ తర్వాత ఉత్పత్తి పెరగడానికి బదులు తగ్గింది. ఇప్పుడు రిలయన్స్ గ్యాస్ ధరను మరింత పెంచడానికి అనుమతించమని ప్రభుత్వంపై గట్టిగా వత్తిడి తెస్తున్నది.

కోల్‌గేట్ కుంభకోణంలో పెద్ద ఎత్తున బొగ్గు వనరులను ప్రైవేటు కంపెనీలకు అప్పగించడం వల్ల అవి రు.1.86 లక్షల కోట్లు లాభపడ్డాయని కాగ్ చెప్పింది. బొగ్గు కుంభకోణం బొగ్గు వనరులను దేశీయ పెట్టుబడిదారులకు పూర్తి ఉచితంగా అందించింది. ఇలా లబ్ధి పొందిన వారిలో ప్రభుత్వంలోని వారి బంధువులు, స్నేహితులే కాకుండా, రిలయన్స్, టాటాలు, హిండాల్కో (బిర్లా), వేదాంత, ఎస్సార్– ఇలా దేశంలోని బడా పెట్టుబడిదారులంతా ఉన్నారు. ఈ కుంభకోణంలో ప్రభుత్వం 4400 కోట్ల టన్నుల బొగ్గును ప్రైవేటు పెట్టుబడిదారులకు ఉచితంగా అందించింది. **ఇది ప్రపంచ వార్షిక ఉత్పత్తికి ఆరు రెట్లు అధికం.**

ఇలాంటి భారీ కుంభకోణాలే కాకుండా వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు పాల్పడిన పెద్ద భూ కుంభకోణాలున్నాయి. అప్పటి మహారాష్ట్ర ముఖ్యమంత్రి అశోక్ చవాన్, ఇతర అధికారుల పాత్ర ఉన్న ముంబాయి ఆదర్శ్ గృహ కుంభకోణం. హర్యానాలో డిఎల్ఎఫ్, రాబర్ట్ వద్రా, హర్యానా ముఖ్యమంత్రి హుడాల ప్రమేయం ఉన్న అనేక భూ కుంభకోణాల గురించి విస్తారంగా మీడియాలో వచ్చింది. రియల్ ఎస్టేట్ అనేది ప్రజాధనం లూటీకి ప్రధాన సాధనంగా మారిందన్నది స్పష్టం.

బిజెపి కూడ అంతగా వెనకబడిపోలేదు. కర్నాటకలో భూకుంభకోణం విలువ రు.50,000 కోట్ల నుండి రు.70,000 కోట్ల వరకు ఉంటుంది. యడియురప్ప హయాంలో ఏకంగా ఒక ఓడరేవునే నిబంధనలకు విరుద్ధంగా నిర్మించారు, దాని ద్వారా అక్రమంగా ఇనుప ఖనిజాన్ని ఎగుమతి చేసేవారు.

గుజరాత్‌లోని మోడి ప్రభుత్వం కెజి బేసిన్ బ్లాక్ లో తన వాటాలో 10 శాతం షేర్లను 64 డాలర్ల పెట్టుబడితో అప్పటికి ఆరు రోజుల క్రితం బార్బడాస్‌లో నమోదయిన కంపెనీకి అప్పగించింది. (ఈ బ్లాక్‌ను రాష్ట్ర ప్రభుత్వ రంగ జిఎస్‌పిసి వేలంలో దక్కించుకుంది). ఆ తర్వాత ప్రజావత్తిడి మేరకు బార్బడాస్ కంపెనీతో కంట్రాక్టు రద్దు చేయబడింది.

ఈ కుంభకోణాలు కాకుండా, పలు రక్షణ రంగ ఒప్పందాలు కూడ ఉన్నాయి. అలాంటి ఒక ఒప్పందం బరక్ మిస్సిలీలకు సంబంధించినది. అన్ని నిబంధనలకు తిలోదకాలిచ్చి ఇజ్రాయిల్ కంపెనీతో ఎన్‌డిఏ ప్రభుత్వం, యుపిఏ ప్రభుత్వం రెండూ మిస్సిలీల కొనుగోలు ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. అప్పటి రక్షణ మంత్రి జార్జ్ ఫెర్నాండెజ్ పైన, ఇతర అధికారులపైన కేసులు పెట్టిన యుపిఏ ప్రభుత్వం, ఇజ్రాయల్ కంపెనీలు – ఇజ్రాయల్ ఎయిర్ క్రాఫ్ట్ ఇండస్ట్రీస్, రాఫేల్– లను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టలేదు. సరికదా, అదే కంపెనీలతో మరింత భారీగా 2 బిలియన్ డాలర్ల (రు.10,000 కోట్లు) కాంట్రాక్టు కుదుర్చుకుంది.

గతంలో ఉన్నత స్థానాల్లో అవినీతికి మూలం నిబంధనలను ఉల్లంఘించి లైసెన్సులు మంజూరు చేయించుకోవడానికి బడా పెట్టుబడిదారులు అందించే ముడుపుల రూపంలో ఉండేది. కాని ఇప్పుడు దేశం అనుసరించే విధానాలనే బడా పెట్టుబడిదారులు నిర్దేశిస్తున్నారు. విధానాలనే నేడు అమ్మకానికి పెడుతున్నారు. అది టెలికం పరిశ్రమ కానివ్వండి, చమురు పెట్రోలియం కానివ్వండి, అణు ఇంధన రంగం కానివ్వండి, రక్షణరంగం కానివ్వండి– ఇష్టమైన కార్పొరేట్ సంస్థలకు లాభం చేకూర్చడానికి విధానాలు రాత్రికి రాత్రే మారిపోతున్నాయి.

మారిషస్ లాంటి పన్ను స్వర్గధామాలు రౌండ్ ట్రిప్పింగ్ అనేదానికి వినియోగించ బడుతున్నాయి. అనేక హవాలా మార్గాలు, చట్టవిరుద్ధంగా తక్కువ, ఎక్కువ ఇన్‌వాయిస్‌ల ద్వారా నల్లడబ్బు ఈ పన్ను స్వర్గధామాలకు తరలించబడుతున్నది. ఆ తర్వాత అది విదేశీ పెట్టుబడుల రూపంలో దేశంలోకి ప్రవేశించి విహరిస్తుంది.

అవినీతి ఇంతగా పెరిగినప్పటికీ బలమైన లోక్‌పాల్ చట్టాన్ని తీసుకు రావడానికి ప్రభుత్వం సిద్ధపడటం లేదు. ప్రభుత్వం ప్రతిపాదించిన లోక్‌పాల్ బిల్లు స్టాండింగ్ కమిటీలో వచ్చిన అంగీకారానికి విరుద్ధంగా ఉంది. లోక్‌పాల్‌పై ప్రత్యేకించి అది నిర్వహించే దర్యాప్తుపై ప్రభుత్వం అదుపు కలిగి ఉండే విధంగా ఈ బిల్లు ఉంది. ఇది భారత ప్రజల ప్రయోజనాలకు విరుద్ధం.

అవినీతికి వ్యతిరేకంగా దేశవ్యాపితంగా విస్తృతమైన ఉద్యమాన్ని చేపట్టాలని సిపిఐ(ఎం) పిలుపునిస్తున్నది. దోషులను శిక్షించాలని, అవినీతి నిరోధానికి బలమైన లోక్‌పాల్‌తో కూడిన ఒక వ్యవస్థాగత చట్రం రూపొందాలని డిమాండ్ చేస్తున్నది. నల్లడబ్బును బయటికి పంపించే అనేక పన్ను లొసుగులను తక్షణం మూసివేయాలని కోరుతున్నది.

# 2. మతతత్వ ప్రమాదం మరింత తీవ్రం

అందరూ అనుకున్నట్లుగా డిసెంబరు 2012 గుజరాత్ ఎన్నికలలో నరేంద్రమోడీ నాయకత్వంలోని బిజెపి విజయం సాధించింది. పరోక్షంగా అయినా తన భవిష్యత్ ప్రధాని అభ్యర్థి మోడీ అని బిజెపి సూచించింది. ప్రధాని-ప్రధాని అన్న భజన తరువాత వచ్చే సాధారణ ఎన్నికలలో మోడీ గాంధీ నగర్ నుంచి ఢిల్లీకి వచ్చే అవకాశాలు మరింతగా ఉన్నాయి. ఎత్తుగడల రీత్యా బిజెపి తన ప్రధాని అభ్యర్థిని ప్రకటించకుండా నిలిపి ఉండవచ్చు. అయితే నిస్సందేహంగా మోడీ, 'తీవ్ర మైనారిటీ వ్యతిరేక హిందుత్వ' వచ్చే ఎన్నికలకు చిహ్నంగా ఉండబోతున్నది. నరోదా-పటాయా మారణకాండ కేసులో జ్యోత్సాయాగ్నిక్ న్యాయమూర్తిగా ఉన్న ప్రత్యేక కోర్టు ముస్లిం మైనారిటీలకు చెందిన 97 మంది స్త్రీ, పురుషులు, పిల్లలను హతమార్చిన ఉదంతంలో మోడీ ప్రభుత్వం ఉదాసీనంగా ఉందని చెప్పిన తరువాత కూడా ఇదంతా జరుగుతోంది. మతతత్వ కుట్రదారులుగా, రెచ్చగొట్టిన వారిగా రాజకీయ నాయకత్వ నేరాన్ని నిర్ధారించిన తీర్పులో మాజీ మంత్రి మాయా కొడనానీ, అప్పటి భజరంగదళ్ కన్వీనర్ బాపు భజరంగీకి దీర్ఘకాల జైలు శిక్షలు విధించారు. ఈ పూర్వరంగంలో మోడీ తదుపరి ప్రధాని అని పెరుగుతున్న నినాదం ప్రస్తుతం ప్రాతినిధ్యం వహిస్తున్న మతోన్మాదశక్తుల తీవ్రమైన, పెరుగుతున్న ప్రమాదాన్ని తేటతెల్లం చేస్తోంది. జాతీయ స్థాయిలో వరుసగా రెండుసార్లు ఎన్నికల ఓటమి తరువాత రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్) తన రాజకీయ సంస్థ బిజెపిని పెద్ద హిందుత్వ వేదికగా ముందుకు నెడుతోంది.

అసోంలోని బోడోలాండ్ స్వయంప్రతిపత్తి జిల్లా ప్రాంతంలో అత్యంత దుర్మార్గమైన మత లేదా తెగల హింసాకాండ 2012లో చెలరేగింది. అవి తలెత్తకుండా అరికట్టటంలో కాంగ్రెస్ నాయకత్వంలోని ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. వారాల తరబడి సాగిన ఘర్షణల్లో వందమందికి పైగా మరణించారు, నాలుగులక్షల మందికి పైగా తమ ఇళ్లు గ్రామాల నుంచి తరిమివేయబడ్డారు. తెగల సమస్యగా ఉన్నదానిని మత సమస్యగా మార్చేందుకు, దాన్ని రాజకీయంగా సొమ్ము చేసుకొనేందుకు హిందూ-ముస్లిం రెండువైపులా ఉన్న మతశక్తులు తమ శాయశక్తులా ప్రయత్నించాయి.

ఆర్ఎస్ఎస్,బిజెపి ద్వయం అసోంలో వలస వచ్చిన వారి వ్యతిరేక భావాలను రెచ్చగొట్టేందుకు, దేశంలోని అనేక భాగాల్లో ఉన్న ఈశాన్య ప్రాంత వాసుల్లో భయాందోళనలను రేపేందుకు ప్రయత్నించింది. ఇది దక్షిణాదిలోని బెంగళూరు, హైదరాబాద్, చెన్నయ్ నగరాల నుంచి పెద్ద సంఖ్యలో ఈశాన్య రాష్ట్రాల పౌరులు తమ ప్రాంతాలకు తరలిపోవటానికి దారితీసింది. ఇదే సమయంలో బిజెపి పాలిత కర్ణాటక గుండా తమ ప్రాంతాలకు వెళుతున్న ఈశాన్య రాష్ట్రాల వలస పౌరులపై ఆర్ఎస్ఎస్,ఎబివిపి కార్యకర్తలు దాడులు కూడా చేశారు. ముస్లిం తీవ్రవాదులు కూడా ఆ సమాజంలోని ఆగ్రహాన్ని, అస్సాం హింస, ఇతర అన్యాయాలను సొమ్ము చేసుకొనేందుకు ప్రయత్నించారు. అది ముంబై, మరికొన్ని చోట్ల పోలీసులతో గొడవకు దారితీసింది. ముంబై ఘర్షణ ఆ కమ్యూనిటీకి చెందిన ఇద్దరి ప్రాణాలు పోవటానికేగాక హిందుత్వ శక్తులు 'బీహారీలను వెళ్లగొట్టండి' అని ముఖ్యంగా హిందుత్వ శక్తులైన రాజథాకరే నాయకత్వంలోని ఎంఎన్ఎస్ పిలుపు నిచ్చేందుకు దోహదం చేసింది. కాంగ్రెస్–ఎన్సిపి ప్రభుత్వం ఈశక్తుల వత్తిడికి లొంగిపోయింది. ముంబై ముస్లింల నిరసన సందర్భంగా తుపాకులతో విరుచుకుపడనందుకు గాను ముంబై పోలీసు కమిషనర్ను పదవి నుంచి తప్పించారు.

జాతీయ స్థాయిలో జనం బిజెపిని అధికారానికి దూరంగా ఉంచినప్పటికీ అనేక రాష్ట్రాలలో పాలన సాగిస్తోంది. మతపరంగా విభజించే హిందుత్వ అజెండాను పద్ధతి ప్రకారం అమలు జరిపేందుకు ఈ రాజకీయ అధికారాన్ని వినియోగిస్తోంది. ఈ ప్రచారంలో మతహింస ఒక ముఖ్యమైన అంశం మాత్రమే. మధ్యప్రదేశ్,చత్తీస్ఘఢ్, గుజరాత్లో మైనారిటీలు తమకు లొంగిపోయే విధంగా చేశారు. బీహార్, జార్ఖండ్, పంజాబ్ వంటి చోట్ల సంకీర్ణ కూటమిలో జూనియర్ భాగస్వామిగా కొన్ని పరిమితులకు లోబడాల్సి వచ్చింది. బిజెపి పాలన మైనారిటీల అణచివేత, మెజారిటీ అనుకూల తీరుగా సాగుతోంది. మరోవైపు కర్ణాటకలో క్రిస్టియన్, ముస్లిం మైనారిటీలకు వ్యతిరేకంగా ఒక పథకం ప్రకారం తొలి డోసు హింసా కాండ సాగించారు. హిందుత్వ శక్తులకు అధికారం ఇచ్చిన చోట వాటి సామాజిక తిరోగమన, కులపరమైన ధోరణులు కూడా వెల్లడయ్యాయి. ప్రమోషన్లలో రిజర్వేషన్ల సమస్యపై సంబంధిత బిల్లును లోక్సభలో అడ్డుకొన్నట్లు చెప్పుకొనేందుకు కాంగ్రెస్కు ఒక అవకాశం ఇస్తూ గత పార్లమెంట్ సమావేశాలలో రెండు సభల సమావేశాల మధ్య బిజెపి తమ వైఖరిని మార్చుకోవటం వచ్చిన అవకాశాన్ని వినియోగించుకోవటంగా భావించరాదు.

మధ్యప్రదేశ్, చత్తీస్ఘడ్ రాష్ట్రాలలోని స్కూళ్లలో ప్రమాణాలు దిగజారటానికి కారణం విద్యార్థులు రోజూ వందేమాతరం గీతాలాపన, సూర్యనమస్కారాలు పెట్టటం,

గాయత్రీమంత్రాన్ని అన్నివేళలా, భోజన సమయంలో భోజన మంత్రం జపించేందుకు ఇచ్చిన ప్రాధాన్యత చదువుపై పెట్టించకపోవటమే. పోలీసులు, హిందుత్వ సంస్థలు నైతిక పోలీసులుగా వ్యవహరిస్తూ భిన్న మతాలు, కులాలకు చెందిన బాలబాలికలు దూరంగా ఉండేందుకు కనీసం కలుసుకోకుండా చూసేందుకు 'కుల, దుస్తుల కోడ్‌లను నిర్ణయించటం, బాలికలు, మహిళలకు లక్ష్మణ రేఖలను గీస్తూ వాటిని అనుసరించాలని వత్తిడి తెస్తున్నారు.

మెల్లగానే అయినప్పటికీ హిందుత్వ ఉగ్రవాద నెట్‌వర్క్ మెల్లగా ముందుకు పోతున్నది. సంఝౌతా ఎక్స్‌ప్రెస్(2007) మరియు మాలెగావ్ ఈద్‌గా ఉగ్రవాద పేలుళ్ల(2008) ఉదంతాలలో మూడు సంవత్సరాల నుంచి తప్పించుకు తిరుగుతున్న ఇద్దరు ముఖ్యపాత్రధారులను డిసెంబరులో అరెస్టు చేశారు. జాతీయ దర్యాప్తు సంస్థ వారి మూలాలకు దగ్గరగా ఉన్నట్లు కనిపిస్తోంది. సహజంగానే ఈ పరిణామం అనేక ఉగ్రవాద సంబంధ కేసులలో పోలీసులు, ఇంటిలిజెన్సు పక్షపాతంగా వ్యవహరిస్తున్నట్లు తీవ్రంగా పరిశీలిస్తే అర్థం అవుతోంది. ఈ ఉదంతాలతో అసలేమాత్రం సంబంధం లేని అమాయక ముస్లిం యువకులను అరెస్టు చేసి చిత్రహింసలకు గురిచేయటం, దీర్ఘకాలం నిర్బంధించటం జరిగింది. దీంతో మరింత దూరం కావటం, నిరసన వ్యక్తం కావటంతో పాటు  మత,ఉగ్రవాద శక్తులు మరింత బలపడేందుకు దోహదం చేస్తోంది.

మతపరమైన ఉద్రికత్తతలు, హింసాకాండ అన్ని వైపులా ఉన్న మతశక్తుల రాజకీయ సమీకరణలకు పదునైన ఆయుధాలుగా ఉంటున్నాయి. మతహింస నిత్యజీవితంలో భాగంగా మత హింస మారిపోయింది. ఉత్తర ప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిషా వంటి రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్‌లోని తెలంగాణా ప్రాంతం, రాజస్థాన్, అస్సాంలలో హిందుత్వశక్తులు మత ఘర్షణలకు ఆజ్యం పోసి వచ్చే ఎన్నికలలో బిజెపికి రాజకీయ లబ్ధి చేకూర్చేందుకు ప్రయత్నిస్తున్నాయి. కొన్ని అంకెలే స్వయంగా ఈ  విషయాన్ని వెల్లడిస్తాయి.

- గతేడాది అక్టోబరు చివరి వరకు దేశంలో 560 హింసా ఘటనలు జరిగాయి. వీటిలో 89 మంది ప్రాణాలు పోయాయి. అంతకు ముందు 2011లో 580 ఘర్షణలు జరిగి 91 మంది మరణించారు.
- ఉత్తర ప్రదేశ్‌లో గతేడాది అక్టోబరు వరకు వందకు పైగా మతకలహాలు జరిగాయి, 34 మంది మరణించారు. మధురలోని కోసీ కలాన్, ఫైజాబాద్, ప్రతాప్‌ఘర్, సితాపూర్, ఘాజియాబాద్,బరెల్లీ వంటి పట్టణాలలో ఈ హింసాకాండ జరిగింది. హోంమంత్రిత్వశాఖ సమాచారం ప్రకారం ఈ ఉదంతాలలో 450 మంది

గాయపడ్డారు. 2011లో 84 మత ఘర్షణల్లో 12 మంది ప్రాణాలు కోల్పోయారు.

- ఉత్తరప్రదేశ్ తరువాత మహారాష్ట్రలో అక్టోబరు వరకు 83 సంఘటనలు జరిగాయి,13 మంది మరణించారు. 2011లో88 ఘటనల్లో 15 మంది చనిపోయారు.
- మధ్యప్రదేశ్‌లో 78 మతఘర్షణలు జరగ్గా 11 మంది ప్రాణాలు పోయాయి, 2011లో 81 ఉదంతాల్లో 15 మంది ప్రాణాలు కోల్పోయారు.
- కర్ణాటకలో 2012లో 54 సంఘటనలు జరగ్గా, 2011లో 70 ఉదంతాలు జరిగి ముగ్గురు, నలుగురు చొప్పున మరణించారు.
- రాజస్థాన్‌లో 2011లో 42 ఘర్షణలు జరిగి 16 మంది మరణించారు. గతేడాది పదినెలల్లో 30 కలహాలు జరిగి ఆరుగురు మరణించారు.
- గుజరాత్‌లో 47 సంఘటనలు జరిగి 2011లో ముగ్గురు మరణిస్తే 2012లో 50 సంఘటనల్లో ఐదుగురు చనిపోయారు.
- పశ్చిమబెంగాల్లో 2011లో 15 ఉదంతాల్లో ముగ్గురు మరణించగా 2012లో 22 సంఘటనల్లో ఎనిమిది మంది చనిపోయారు.
- గడచిన మూడు సంవత్సరాలలో దేశమంతటా జరిగిన మతకలహాలలో 2009 మార్చి నుంచి 2012 మే వరకు 344 మంది మరణించినట్లు లోక్‌సభకు తెలిపిన వివరాలు పేర్కొన్నాయి. ఇదే సమయంలో ఉత్తర ప్రదేశ్‌లో బహుజన్ సమాజవాదీ పాలనలో 1,378 సంఘటనల్లో 68 మంది మరణించగా 385 మంది గాయపడ్డారు.
- కాంగ్రెస్-నేషనలిస్టు కాంగ్రెస్ పాలిత మహారాష్ట్రలో 356 ఉదంతాలలో 57 మంది మరణించగా 1,074 మంది గాయపడ్డారు.
- బిజెపి పాలిత కర్ణాటకలో ఇదే సమయంలో 261 సంఘటనల్లో 54 మంది మరణించగా 725 మంది గాయపడ్డారు.
- మరో బిజెపి పాలిత రాష్ట్రమైన మధ్యప్రదేశ్‌లో 313 ఘటనల్లో 53 మంది చనిపోగా 716 మంది గాయపడ్డారు.
- కాంగ్రెస్ పాలిత రాజస్థాన్‌లో 489 సంఘటనల్లో 37 ప్రాణాలు పోగా 135 మంది గాయపడ్డారు.
- గుజరాత్‌లో 181 ఘటనల్లో 32 మంది మరణించగా 575 మంది గాయపడ్డారు.

# 3. విద్యారంగ ప్రైవేటీకరణ, వ్యాపారీకరణ

గత రెండు దశాబ్దాల నయా ఉదారవాద విధానాల ఉన్నత స్థాయి జిడిపి వృద్ధి రేటు తరువాత కూడా విద్యారంగం దుస్థితిలో కొనసాగుతోంది. ప్రస్తుత ఈ స్థితి కొనసాగటానికి ఒక ప్రధాన కారణమేమంటే గత కేంద్ర ప్రభుత్వాలు మరిన్ని వనరులను కేటాయించేందుకు నిరాకరించటమే. అదే ప్రపంచ మానవాభివృద్ధి సూచికలో మనం 114వ స్థానంలో ఉండటానికి కూడ కారణం. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి పలు నిపుణుల కమిటీలు సూచించినట్లు, వివిధ తరగతులు డిమాండ్ చేసినట్లు జిడిపిలో ఆరుశాతం లేదా బడ్జెట్‌లో పదిశాతం విద్యకు కేటాయింపులు అనేవి ఎండమావిగానే ఉన్నాయి. వామపక్షాల వత్తిడి కారణంగా యుపిఏ 1 హయాంలో కొంత మొత్తం పెంచినప్పటికీ యుపిఏ 2 కాలంలో పరిస్థితి తిరగబడింది. స్వల్ప మొత్తాలను కూడా ఖర్చు చేయకుండా కోత విధిస్తున్నారు. ముఖ్యంగా 2009 నుంచి కాంగ్రెస్ నాయకత్వంలోని యుపిఏ 2 ప్రభుత్వం అధికారానికి వచ్చిన తరువాత విద్యారంగంలో నయా ఉదారవాద అజెండా అమలుకు గట్టి ప్రాధాన్యత ఇస్తున్నారు. 2009 లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ నినాదమైన ఆమ్‌ఆద్మీ కోసం ఏమాత్రం కట్టుబడిలేరు. అధికారానికి వచ్చిన 2009 మే నెలలో అప్పటి మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి కపిల్ సిబల్ విద్యారంగంలో 'వందరోజుల ప్రణాళిక' ప్రకటించారు. దేశంలోని విద్యారంగానికి పునరుత్తేజం కలిగించి పటిష్ట పరుస్తామని చెప్పారు. అప్పటి నుంచి బడ్జెట్ కోతల రూపంలోనే కాదు విద్య వ్యాపారీకరణ, ప్రయివేటీకరణకు దాడిని తీవ్రం చేశారు. ఈ ధోరణి గత రెండు దశాబ్దాల నుంచి అనుసరించినదే. ఈ కాలంలో విద్యా విధానంలో ప్రజాస్వామిక విలువలను దెబ్బతీసేందుకు ఒక పద్దతి ప్రకారం ప్రయత్నించారు. గరిష్ట లాభాపేక్షతో కూడిన మార్కెట్ వాదనల అడుగులకు మడుగులొత్తి లొంగుబాటును ప్రదర్శించారు. విధానాలను రూపొందించే అధికారాన్ని చట్టసభలు,

పార్లమెంట్‌కు లేకుండా లాగివేసేందుకు ఉన్నత విద్య మరియు పరిశోధన బిల్లు-2011 వంటి వాటితో పూనుకున్నారు. చట్టసభలకు బదులు ఏడుగురితో కూడిన ఉన్నతాధికార కమిటీని ప్రతిపాదించారు. దానికి అపరిమిత అధికారాలు ఉంటాయి. బూర్జువా ప్రజాస్వామ్యం గురించి ఎన్నో భ్రమలు ఉన్నప్పటికీ ఇప్పుడు చట్టసభలు, పార్లమెంటు ఈ దేశ ప్రజలకు జవాబుదారీలు. ఈ ప్రతిపాదిత ఉన్నతాధికార కమిటీ ఎలాంటి తనిఖీలు లేని మార్కెట్‌కు అవకాశమిస్తూ ఎవరికీ జవాబుదారుగా ఉండదు. పాఠశాల విద్యారంగంలో ఇటువంటి ధోరణులనే చూశాము. స్వయంప్రతిపత్తిగల రాష్ట్రాల బోర్డులు సిలబస్, పాఠ్యాంశాలను తీవ్ర నిర్లక్ష్యం చేశాయి.

సర్వ అనర్థాలకు చక్కటి పరిష్కారం మార్కెట్ అని చెప్పటం వర్తమాన విధాన ఉదాత్త లక్షణం. మనదేశ విద్యారంగాన్ని తీవ్ర ప్రక్షాళన చేయాలన్న వాస్తవంపై ఎవరూ విభేదించరు. కానీ దీనికి భిన్నంగా మార్కెట్ అనేది బంగారు మంత్రదండంగా నమ్ముతున్నారు. అదే జరిగితే ప్రస్తుత నిర్దేశిత మార్గం సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేస్తుంది. ఎంతో పెద్ద వైవిధ్యం ఉన్న మనదేశంలో ఒక విధాన చట్రపు లక్షణాన్ని నిర్వచించేందుకు ప్రజాస్వామిక వైఖరి, భాగస్వామ్యం ఎంతో అవసరం. ఆ క్రమంలోనే విభిన్న తరగతులు దానితో సంబంధాలు పెట్టుకోవటంతో పాటు విద్యాక్రమం నుంచి లబ్ధిపొందుతాయి. ఉన్నత విద్య, పరిశోధన బిల్లులో ఉన్న దాని ప్రకారం పైనుంచి కిందకు అనే వైఖరితో ఢిల్లీలో కొందరు జ్ఞానవంతులు కూర్చొని దేశం మొత్తానికి విధానాన్ని రూపొందిస్తారు. అది ఇబ్బందులను మరింత పెంచేదే అవుతుంది. బోధన అంటే కొంత సమాచారాన్ని అందించడం, శిక్షణ ఇవ్వడానికే పరిమితమై ఉండదు, దానికి నిర్దిష్ట సాంస్కృతిక పూర్వరంగం కూడ ఉంటుంది. మౌలిక సంస్కరణలని ఊదరగొట్టి సమర్థించుకొంటున్నవి ఆచరణలో విద్యారంగంలో మార్కెట్ తర్కాన్ని నింపేవే అవుతాయి.

ప్రస్తుత పరిస్థితి ఏమిటి? విద్యారంగంపై ఖర్చు మన జిడిపిలో మూడు శాతం కూడా లేదు. అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలలో ఉన్నత విద్యలో 45-85శాతం మధ్య చేరుతుండగా మన దేశంలో 17-23 సంవత్సరాల వయస్సున్న 100 మంది యువతీ యువకుల్లో 90 మంది కాలేజీ, విశ్వవిద్యాలయాల వెలుపల ఉన్నారు. ఒకటవ తరగతిలో చేరిన వందమందిలో 12వ తరగతివరకు చేరుతున్న వారు 16.6శాతం మాత్రమే. ఈ లోపభూయిష్టమైన విధానాల పర్యవసానాలను పేదలు, సామాజికంగా ఆర్థికంగా వెనుకబడిన తరగతులైన మహిళలు, దళితులు, ఆదివాసీలు, మైనారిటీలు అనుభవిస్తున్నారు. ప్రభుత్వ ఖర్చు హీనంగా ఉంటోంది. విద్యకు 2011-12 బడ్జెట్‌లో రు. 21,912 కోట్లు కేటాయించగా దీనిలో రు. 2,068 కోట్లు ఖర్చు చేయలేదు. అసలు

కేటాయింపే తక్కువ కాగా దానిలోకూడా పూర్తిగా ఖర్చు చేయటం లేదు. నయా ఉదారవాద వైఖరికి అనుగుణంగా ప్రభుత్వ విద్యను ఒక పథకం ప్రకారం దిగజార్చి ప్రయివేటు, విదేశీశక్తులకు అవకాశం కల్పించేందుకు పూనుకుంది.

## ఉన్నత విద్య

వర్తమాన మలితరం సంస్కరణల దశను ప్రపంచ పరిణామాలనుంచి విడిగా చూడలేము. 2008లో ప్రారంభమైన ప్రపంచ ఆర్థిక సంక్షోభం ఇప్పటికీ కొనసాగుతోంది. ఇతర ప్రపంచ పెట్టుబడిదారీ సంక్షోభాల మాదిరే ఈ సంక్షోభం నుంచి కూడా బయటపడేందుకు నూతన మార్గాలను అన్వేషిస్తున్నారు. అది నూతన గరిష్ట లాభార్జన పద్ధతులను వెదకటం ద్వారానే జరుగుతుంది. ప్రపంచ ఉత్పాదక వ్యవస్థలలో 'జ్ఞానం' ఒక ముఖ్యమైన పాత్ర పోషిస్తున్న తరుణంలో పెద్ద సంఖ్యలో యువతరం ఉండి ఉన్నత విద్యకు ప్రత్యేకించి మూడవ ప్రపంచ దేశాలలో డిమాండ్ ఉంది. ఇది గరిష్ట లాభార్జనకు పెద్ద అవకాశాలను కల్పిస్తుంది.

మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రిగా పదవి స్వీకరించిన వెంటనే కపిల్ సిబాల్ భారత ఉన్నత విద్యా వ్యవస్థ ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించేందుకు ప్రొఫెసర్ యశపాల్ అధ్యక్షతన ఒక కమిటీని వేశారు. ఉన్నత విద్యలో అవసరాలు, సరఫరాల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ఆ కమిటీ చూపింది. ఆస్ట్రానమికల్ ఫిజిక్స్‌లో యశపాల్ కృషి అందరికీ తెలిసినదే. దీనితోపాటు 1990 దశకంలో జాతీయ టెలివిజన్‌లో సామాన్యులకు అర్థమయ్యే భాషలో సైన్సు కార్యక్రమాలను రూపొందించి పేరుగాంచారు. శాస్త్రీయ హేతుబద్ధతతో ఉండే ఆయన వాక్కును ఉన్నత విద్యారంగంలో ప్రయివేటు పెట్టుబడికి ఆటంకంగా ఉన్నవాటిని తొలగించే వాదనలకు ప్రభుత్వ వినియోగించింది. ప్రయివేటు రంగంతో పాటు ప్రభుత్వరంగంలో ఖర్చు చేయాల్సిన అవసరాన్ని యశపాల్ వాదించారు. మొత్తంగా ప్రభుత్వరంగ ఖర్చును ఆయన ఆక్షేపించలేదు. అయితే ఆయన నివేదికను మొత్తం వ్యవస్థను పునర్వ్యస్తీకరించేందుకు అనువుగా చేసుకున్నారు.

విద్య వాస్తవానికి రాష్ట్రాల జాబితాలో ఉంది. ఇందిరాగాంధీ నియంతృత్వపాలనా కాలంలోనే దానిని ఉమ్మడి జాబితాలోకి మార్చారు. అది కూడా మన రాజ్యాంగంలోని ఫెడరల్ నిర్మాణానికి అనుగుణంగానే చేశారు. కేంద్రం అదే విధంగా రాష్ట్రాల పరిధిలో విద్య ఉంది. విధానపరమైన లోపాలకు ప్రత్యామ్నాయాలను అనుసరించేందుకు ఫెడరల్ వ్యవస్థ రాష్ట్ర ప్రభుత్వాలకు అవకాశం కల్పించింది. వామపక్ష, వామపక్ష ప్రజాతంత్ర ప్రభుత్వాల అనుభవమిది. ప్రయివేటు, విదేశీ పెట్టుబడులను విద్యారంగంలో

అనుమతిచేందుకు ప్రత్యామ్నాయ విధానాలకు ఉన్న అవకాశాలను మూసివేయాల్సి ఉంటుంది. అప్పటి నుంచి ఒక పథకం ప్రకారం ఉన్నత విద్యపై కేంద్రీకరించేందుకు అసలు ఫెడరలిజంపైనే దాడిని ప్రారంభించారు. ఉన్నత విద్య, పరిశోధనకు జాతీయ కౌన్సిల్ బిల్లు ద్వారా ఇది జరిగింది. అంతకు ముందు ఉనికిలో ఉన్న యుజిసి, ఏఐసిటిఇ, బార్ కౌన్సిల్‌ను తొలగించి వాటి స్థానంలో ఉన్నతాధికార వ్యవస్థను ప్రతిపాదించారు. గతేడాది డిసెంబరులో ఈ బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టారు. అంతకు ముందే ఇలాంటి అనేక బిల్లులు చర్చకు లేదా ప్రవేశానికి ఎదురు చూస్తుండగా దీనిని ప్రాధాన్యత క్రమంలో ఆరవదిగా చేర్చారు. ఈ బిల్లులోని అంశాలు ఏమిటి? విశ్వవిద్యాలయాల గ్రాంట్ల సంఘం, ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ వంటివాటిని బిల్లు ఆమోదం తదుపరి రద్దు చేస్తారు. 'ప్రపంచ ప్రమాణాలకు అనుగుణ్యంగా నూతన పద్దతుల్లో సమగ్ర మరియు ఏకీకృతమైన ఉన్నత విద్య, పరిశోధన అభివృద్ధికి గాను ఉన్నత విద్యను పెంపొందించటానికి ఈ బిల్లును ఉద్దేశించినట్లు పేర్కొన్నారు. ఏర్పాటు చేసే కమిషన్ వ్యవసాయ విద్య, వైద్య విద్య కనీస ప్రమాణాలకు సంబంధించిన అంశాలపై ఒక నేషనల్ కమిషన్ ఫర్ హ్యూమన్ రిసోర్స్ ఫర్ హెల్త్ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన ఉన్నందున ఈ రెండు మినహా మిగిలిన ఉన్నత విద్య, పరిశోధన ప్రమాణాలపై సమన్వయం, నిర్వహణలను అందిస్తుందని పేర్కొన్నారు. దీనికి ఒక చైర్ పర్సన్ ఆరుగురు సభ్యులు ఉంటారు. వారిలో ఒకరు పైన పేర్కొన్న మానవ వనరుల కమిషన్ చైర్‌పర్సన్ అయి ఉంటారు. ఈ వ్యక్తిని రాష్ట్రపతి నియమిస్తారు. ఎవరిని నియమించాలనేది ప్రధాని అధ్యక్షతన లోక్‌సభ స్పీకర్, ప్రతిపక్ష నేత, వైద్య, ఉన్నత విద్యల మంత్రులు సభ్యులుగా ఉన్న అన్వేషణ మరియు ఎంపిక కమిటీ ఎన్నిక చేసి ప్రతిపాదిస్తుంది.

ప్రస్తుతం ఉన్న నియంత్రణ సంస్థల అసమర్థత, అవినీతి అక్రమాలకు విరుగుడుగా సర్వాధికారాలుగల కమిటీని బిల్లు ప్రతిపాదించింది. నిజానికి ఇది మరింత నిరంకుశ, నియంతృత్వాలను, అవినీతిని ముందుకు తెస్తుంది. కేంద్రీకరణను పెంచేందుకు దోహదం చేసే వ్యవస్థ నిర్మాణాన్ని అవసరమైతే విస్తృత పరుస్తామని సవరించిన బిల్లు చెబుతోంది. ఫెడరల్ నిర్మాణంపై దాడి గురించి ఉన్న తీవ్ర ఆందోళన, రాష్ట్రాల హక్కులు హరించుకుపోవటం గురించి ఎలాంటి ప్రస్తావన లేదు. ప్రయివేటు, విదేశీ పెట్టుబడులు నిరాటంకంగా రావటానికి ఉన్న ఆటంకాలను తొలగించాలని ఈ సవరణలు కోరుతున్నాయి.

ఇంతే కాదు, 2009 నుంచి దేశంలోని దాదాపు అన్ని విశ్వవిద్యాలయాలలో దూకుడుగా అకడమిక్ సంస్కరణలు అమలు జరుగుతున్నాయి. లబ్దిదారుల ఆందోళనలను పట్టించుకోకుండా ఏమాత్రం లెక్కచేయని పద్దతుల్లో సంస్కరణలను

అమలు జరుపుతున్న ఢిల్లీ విశ్వవిద్యాలయం తీరుతెన్నులు ఒక నీచ ఉదంతానికి ఉదాహరణ. సెమిస్టర్ విధానం ఇంకా కుదురుకోక ముందే వచ్చే ఏడాది నుంచి నాలుగేళ్ల డిగ్రీ కోర్సును ప్రవేశ పెట్టేందుకు యంత్రాంగం ముందుకు పోతున్నది. అది కూడా ఎలాంటి ముందు ఏర్పాటు లేకుండా. ఈ సంస్కరణలు సౌకర్యాల సంక్షోభాన్ని తీవ్రం చేయటంతో పాటు వేలాది మంది విద్యార్థులు భవిష్యత్‌ను అయోమయంలో పడవేస్తాయి.ముఖ్యంగా సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు నూతన అకడమిక్ వ్యవస్థకు అలవాటు పడటానికి కష్టం అవుతుంది. మహారాష్ట్రలో పరీక్షల సంస్కరణల పేరుతో ఇలాంటి సంస్కరణలనే ముందుకు తెచ్చారు. ఈ పైమెరుగులు సామర్థ్యాన్ని పెంచటానికి బదులు ఉన్నత విద్యా వ్యవస్థ సంక్షోభం మరింత పెరుగుతుంది.

విద్యారంగాన్ని విస్తరించేందుకు అవసరమైన వనరులకోసం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు అన్నవాదన ఒక వివాద సమస్య. ఇతర దేశాల అనుభవం చూసినపుడు ఇవి వ్యతిరేక ప్రభావం చూపినట్లు స్పష్టంగా కనపడింది. అభివృద్ధి చెందుతున్న దేశాలలో మానవ పెట్టుబడిని తయారు చేయటానికి విదేశీ పెట్టుబడులు తోడ్పడతాయని చెప్పుకుంటున్న నయా ఉదారవాద వాదన అసమర్థమైనదని చారిత్రకంగా రుజువైంది. పేద దేశాల నుంచి ధనిక దేశాలకు రుణాల రూపంలో తరలించేందుకు, పెట్టుబడిదారీ ధనిక దేశాల గరిష్ట లాభాలకు ఇది ఒక కీలకమైనదిగా తేలింది. ఈ దశలో సామాజిక న్యాయ సమస్యను ఒక పద్ధతి ప్రకారమే విస్మరించారు. అత్యధిక విద్యా సంస్థలలో 27శాతం ఓబిసి రిజర్వేషన్లను అమలు జరపలేదు. అర్హత మార్కులను సాకుగా చూపి నిబంధనలను తారుమారు చేశారు. రాజ్యాంగం ప్రకారం ఎస్‌సి, ఎస్‌టి తరగతులకు రిజర్వు చేసిన సీట్లు సంవత్సరాల తరబడి ఖాళీగా ఉంటున్నాయి. సామాజిక న్యాయానికి అధికారయంత్రాంగంలో పద్ధతి ప్రకారమే వ్యతిరేకత ఉంది. ప్రభుత్వం నడిపే స్కాలర్‌షిప్పు పథకాలను కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది. కేంద్ర మైనారిటీ మంత్రిత్వ సంక్షేమ శాఖ మౌలానా అజాద్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ గ్రాంట్‌కు కోత పెట్టింది.

## పాఠశాల విద్య

పెద్ద ఎత్తున టాంటాం వేసిన విద్యాహక్కు చట్టం సార్వత్రిక పాఠశాల విద్యను అందించటంలో విఫలమైంది. ప్రభుత్వ నిధులు తగినన్ని కేటాయించకపోవటమే దీనికి ప్రధాన కారణం. ఎప్పుడో 2009లోనే పార్లమెంట్ చట్టాన్ని ఆమోదించినప్పటికీ ఆర్థిక బాధ్యతను తీసుకొనేందుకు యుపిఏ సర్కారు తిరస్కరిస్తోంది. మొత్తం భారాన్నంతా రాష్ట్రాలపై పెట్టేందుకు నిర్ణయించింది. నయా ఉదారవాద విధానాల దశలో ఇప్పటికే రాష్ట్రాలు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. ( ఒక అంచనా ప్రకారం ప్రభుత్వ

పథకాలపై చేస్తున్న ప్రతి వందరూపాయల ఖర్చులో 60 రాష్ట్రాల నుంచే వస్తున్నాయి. ఇదే సమయంలో ప్రతి వంద రూపాయల పన్ను ఆదాయంలో రాష్ట్రాలకు దక్కుతున్న వాటా 34 రూపాయలు కూడా లేదు.) విద్యా హక్కును తుచ తప్పకుండా అమలు జరపాలంటే పాఠశాల భవనాల నిర్మాణంతో పాటు 14లక్షల మంది టీచర్లు, ఇతర సిబ్బంది ఏర్పాటుకు ప్రభుత్వ నిధులు అవసరం. ప్రభుత్వ ఖర్చు చేయటానికి బదులు విద్యాహక్కు చట్టం ముసుగులో పాఠశాల విద్యను ప్రయివేటీకరించేందుకు ప్రభుత్వం పూనుకుంది. ప్రభుత్వ, ప్రయివేటు భాగస్వామ్యం పేరుతో ఆరువేల స్కూళ్లను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదించింది. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రయివేటు స్కూళ్లలో 25శాతం సీట్లను పేద విద్యార్థులకు రిజర్వు చేయాలన్న ఆదేశం ఉంది. అయితే ఎక్కడా దీన్ని పాటించటం లేదు.

## వృత్తి, సాంకేతిక విద్య

వృత్తి, సాంకేతిక విద్యకు పెట్టుబడిదారులకు అవసరమైన సాంకేతిక కార్మికశక్తితో ప్రత్యక్ష సంబంధం ఉంది. దానిలో భాగంగా స్వాతంత్ర్యానంతర దశలో గొలుసు కట్టుగా ఐటిఐలను, తరువాత ప్రభుత్వమే ఐఐటిలు, ప్రాంతీయ ఇంజనీరింగ్ కాలేజీల వంటి వాటిని ఏర్పాటు చేసింది. గడచిన రెండుదశాబ్దాలలో ఈ రంగం మొత్తంలో పెద్ద ఎత్తున ప్రయివేటీకరణ, వాణిజ్యీకరణ జరిగింది. ఈ సంస్థలలో అవసరమైన నైపుణ్యాన్ని, శిక్షణను ఇవ్వటంలో విఫలమైనప్పటికీ భారీ ఫీజులతో డబ్బులు ముద్రించే దుకాణాల మాదిరి తయారయ్యాయి. పర్యవసానంగా ఈ సంస్థల నుంచి బయటకు వచ్చిన ఎక్కువ మంది విద్యార్థులు నిరుద్యోగులుగా ఉన్నారు. ఒక అధ్యయనం ప్రకారం ప్రతి ఏటా ఏడులక్షల మందికి పైగా ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లు బయటకు వస్తుండగా కనీసం ఒక లక్షమందికి ఎలాంటి ఉద్యోగం దొరకటం లేదని తేలింది.

## పౌరులా? లాభాలా?

ఈ రోజు విద్యారంగంలో ఒకవైపు కొద్ది మంది కార్పొరేట్, ప్రయివేటు శక్తులు లాభాల కోసం తీవ్రంగా పోటీ పడుతున్నారు. మరోవైపున దేశంలో అత్యధికుల అవసరాలు తీరటం లేదు. మన దేశ జనాభాలో సగానికి పైగా 35 ఏళ్ల లోపు వారు ఉన్నారు. వారికి తగిన విద్య అందచేస్తే వారి శక్తిని ప్రజాభివృద్ధిగా మార్చవచ్చు. అంతేకాదు, మన జాతి నిర్మాణ క్రమంలో విద్య ఒక అత్యవసరం. దీని ద్వారానే నిర్లక్ష్యానికి గురైన బృందాలు, సమాజాలను మన ప్రజాస్వామిక వ్యవస్థ ప్రధాన స్రవంతిలోకి తీసుకురాగలము.

# 4. పెరుగుతున్న నిరుద్యోగం

నేడు యువతరం భవిష్యత్తు అగమ్యగోచరంగా ఉంది. ఉపాధి అవకాశాలు రోజు రోజుకు కుదించుకు పోతున్నాయి. నిరుద్యోగ భూతం వారిని వెన్నాడుతోంది. దుర్భర భవిష్యత్తు వారిని భయపెడుతున్నది. నిరాశ నిస్పృహలతో వారున్నారు. కొత్త కొత్త నైపుణ్యాలను నేర్చుకొని, అదనపు అర్హతలు సంపాదించుకున్న తర్వాత వారి పరిస్థితి ఈ విధంగా ఉంది. పాక్షిక నిరుద్యోగం కూడ వారిని వెంటాడుతున్నది. ఉన్నత అర్హతలు కలిగిన వారు దిగువ స్థాయి ఉద్యోగాలు చేస్తున్నారు. ఇది కేవలం యువత పరిస్థితే కాదు. మధ్య వయస్కులు కూడ అకస్మాత్తుగా ఉపాధి కోల్పోయి వీధిన పడుతున్నారు. వారి స్థానంలో తక్కువ వేతనానికి పనిచేసే కాజువల్ కార్మికులను నియమించుకునేందుకు కార్పొరేట్లు దీనికి పాల్పడుతున్నాయి. అందుచేత ఉద్యోగంలో ఉన్నవారు సైతం అది ఎప్పుడు వూడుతుందో తెలియక భయపడుతున్నారు. ఉద్యోగ భద్రత, పెన్షన్లు అనేవి గత కాలపు చిహ్నాలుగా మారాయి. కాంట్రాక్టు, కాజువల్ అనేవి వూతపదాలుగా మారాయి.

గత కొన్నేళ్లుగా కేంద్రంలోని ప్రభుత్వాలు అనుసరిస్తున్న నయా ఉదారవాద విధానాల పర్యవసానాలు ఇవి. ఈ విధమైన సరళీకరణ, ప్రైవేటీకరణ విధానాలను యధేచ్ఛగా కొనసాగించడం ఫలితంగా ఇప్పటికే దిగజారిన ఉపాధి అవకాశాలు మరింత కుదించుకుపోతున్నాయి. పరిస్థితి ఎంత నిరాశాజనకంగా ఉందో 66వ జాతీయ శాంపుల్ సర్వే స్పష్టం చేస్తున్నది. 2000-05 మధ్య ఐదేళ్ల కాలంలో ఉపాధి కల్పన రేటు 2.7 శాతం నుండి, 2005-10 మధ్య కాలంలో 0.8 శాతానికి పడిపోయింది. అంతేకాకుండా, వ్యవసాయేతర రంగంలో ఉపాధి కల్పన రేటు ఇదే కాలంలో 4.65 శాతం నుండి 2.53 శాతానికి పడిపోయింది. 2005-10 మధ్య కాలంలో జిడిపి 8 శాతం చొప్పున కన్నా ఎక్కువ రేటుతో పెరిగినప్పటికీ ఈ పరిస్థితి ఏర్పడింది.

అయినప్పటికీ, అధిక జిడిపి రేటు అంటే అధిక ఉపాధి కల్పన అని మనకు చెప్పడం కొనసాగుతూనే ఉంది. ఇది కేవలం ఉపాధి రహిత అభివృద్ధి మాత్రమే కాదు, ఉపాధిని హరించే అభివృద్ధి అని అర్థం చేసుకోవాలి. వంద రోజులు పని కల్పిస్తుందని చెప్పిన ఉపాధి హామీ పథకం, కుటుంబానికి ఏడాదికి కేవలం 40 నుండి 50 రోజులు మాత్రమే పనికల్పించడంలో దాని వైఫల్యం అర్థమవుతున్నది.

15-29 సంవత్సరాల మధ్య యువకుల్లో తీవ్రంగా ఉన్న నిరుద్యోగం ఆందోళన కల్గిస్తున్నది. గ్రామీణ ప్రాంత యువకుల్లో 10.9 శాతం, గ్రామీణ యువతుల్లో 12 శాతం నిరుద్యోగం ఉంది. పట్టణ ప్రాంతాల్లో నిరుద్యోగం కూడ భయం కొలుపుతున్నది. పట్టణ ప్రాంతాల్లో యువకుల్లో 10.5 శాతం, యువతుల్లో 18.9 శాతం నిరుద్యోగం కొనసాగుతున్నది. గ్రామీణ, పట్టణ ప్రాంతాలు రెండింటిలోను విద్యావంతులైన 15 అంతకన్నా ఎక్కువ వయసు కలిగిన వారిలో సెకండరీ అంతకన్నా ఎక్కువ చదువుకున్న వారిలో అంతకన్నా తక్కువ చదువుకున్న వారిలోకన్నా అధిక నిరుద్యోగం రేటు ఉంది.

దేశవ్యాపితంగా 966 ఎంప్లాయ్‌మెంట్ ఎక్ఛేంజ్‌లలో నమోదు చేసుకున్న నిరుద్యోగుల సంఖ్య 2009 చివరి నాటికి 3.89 కోట్లు. వీరిలో చదువుకున్నవారు 2.9 కోట్లు, నిరక్షరాస్యులు 90 లక్షలు. ఎంతో మంది నిరుద్యోగులు ప్రభుత్వం వద్ద నమోదు చేసుకున్నా ఫలితం ఉండదని విశ్వాసం కోల్పోయి నమోదు చేసుకోని పరిస్థితిలోనే ఇంత భారీ సంఖ్యలో నమోదు చేసుకున్న నిరుద్యోగులు ఉన్నారంటే, పూర్తి వాస్తవాన్ని తేలిగ్గా అర్థం చేసుకోవచ్చు.

ఇలాంటి గడ్డు పరిస్థితిలో కాంగ్రెస్ నాయకత్వంలోని యుపిఏ ప్రభుత్వం మల్టీబ్రాండ్ చిల్లర రంగంలో ఎఫ్‌డిఐని అనుమతించాలని నోటిపై చేయడం ఎంతటి దారుణమైన పరిస్థితులకు దారితీస్తుందో వూహించుకోవచ్చు. చిల్లర వ్యాపారంలో 4 కోట్ల మంది నేడు ఉపాధి పొందుతున్నారు. ఇప్పుడు వారి ఉపాధి ప్రమాదంలో పడింది. ఈ పాలనా ఉత్తర్వును పార్లమెంటులో సవాలు చేయడం జరిగింది. అత్యధిక ఎంపీలు, పార్టీలు ఈ జాతి వ్యతిరేక చర్యను తీవ్రంగా వ్యతిరేకించారు. యుపిఏ భాగస్వామ్య పక్షాలు కూడ కొన్ని దీన్ని వ్యతిరేకించాయి. పార్లమెంటు వెలుపల వ్యాపారులు, ఈ రంగంలో పనిచేస్తున్న కార్మికులు, రాజకీయ పార్టీలు, సాధారణ ప్రజలు గట్టిగా వ్యతిరేకించారు. ఇంతటి విస్తృతమైన వ్యతిరేకత వచ్చినప్పటికీ ప్రభుత్వం మొండిగా ముందుకు సాగింది. ఇది వినాశకర పర్యవసానాలకు దారితీస్తుంది.

ఏ దేశం అనుభవం చూసినా రీటైల్ రంగంలో ఎఫ్‌డిఐ ఉపాధిని పెంచుతుందని, రైతులకు ప్రయోజనం చేకూరుస్తుందని ప్రభుత్వం చేసే వాదనలు తప్పని స్పష్టమవుతుంది. వాల్‌మార్ట్, టెస్కో, కారెఫోర్ మొదలైన బడా రీటైల్ కార్పొరేట్ సంస్థలు ఉపాధిని హరిస్తాయని, రైతుల ప్రయోజనాలను దెబ్బతీస్తాయని ఏ మాత్రం సందేహానికి తావులేకుండా రుజువు చేశాయి.

ప్రభుత్వం నేడు ఒకవైపున పేదలకు మిగులు భూమి, బంజరు భూమి పంచి పెట్టడానికి నిరాకరిస్తున్నది. మరొకవైపున, విస్తారమైన భూమిని బడా కంపెనీలకు, బహుళజాతి సంస్థలకు అభివృద్ధి పేరుతో నిస్సిగ్గుగా ధారాదత్తం చేస్తున్నది. ఇలాంటి నిర్లక్ష్య పూరిత అభివృద్ధి రైతులు ఎంతో కాలంగా సాగుచేసుకుంటున్న భూమినుండి

వెళ్లగొడుతుందని, వారి ఉపాధిని హరించి దారిద్ర్యంలోకి నెట్టివేస్తుందని మనందరికీ తెలుసు. 1995 నుండి 2.90 లక్షల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు.

కేంద్ర ప్రభుత్వరంగ సంస్థల్లోను, దాని ఆధ్వర్యంలోని ఇతర ప్రభుత్వ రంగ యూనిట్లలోను రిక్రూట్‌మెంట్‌ను పూర్తిగా నిలిపివేయడంలోనే ఉపాధి కల్పన పట్ల కేంద్ర నేరపూరిత వైఖరి అర్థమవుతుంది. వేతన బిల్లులను తగ్గించుకునేందుకు తాత్కాలిక, కాంట్రాక్టు పద్ధతిలో నియామకాలు కొనసాగించడం సాధారణ విషయంగా మారింది. ఇదే సమయంలో కార్పొరేట్ రంగానికి రాయితీల మీద రాయితీలు ఇవ్వడంలో ఎలాంటి విచక్షణ పాటించడం లేదు. ప్రోత్సాహకాల పేరుతో ప్రతి బడ్జెట్‌లోను కేంద్రం వారికి భారీ రాయితీలను కల్పిస్తున్నది. గత ఐదేళ్ల కాలంలో ప్రభుత్వం ఇలాంటి రాయితీల వల్ల సగటున ఏడాదికి రు.5 లక్షల కోట్ల ఆదాయాన్ని కోల్పోయింది. కాని పేదలకు సబ్సిడీలు ఇచ్చే విషయంలో కాని, రిక్రూట్‌మెంట్‌పై నిషేధాన్ని ఎత్తివేసే విషయంలో కాని, నిరుద్యోగ భృతిని పెంచే విషయంలో కాని ప్రభుత్వానికి ఎక్కడి లేని వనరుల కొరత అడ్డం వస్తున్నది.

ఒక రంగం తర్వాత మరొక రంగంలో, ఒక శాఖ తర్వాత మరొక శాఖలో పోస్టులు ఖాళీగా అట్టిపెట్టబడుతున్నాయి, తర్వాత రద్దుచేయబడుతున్నాయి. వివిధ కేంద్ర ప్రభుత్వ రంగ శాఖల్లో 10 లక్షల పోస్టులకు పైగా ఖాళీగా పడి ఉన్నాయి. పోలీసు, రక్షణ దళాలలోనే భర్తీ చేయని పోస్టులు 7 లక్షలు ఉన్నాయి.

రైల్వేలలో భారీ సంఖ్యలో ఖాళీలు ఉన్నాయి. 2011 ఏప్రిల్ 1 నాటికి రైల్వేలలో 2.2 లక్షల గ్రూపు సి, గ్రూపు డి పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అలాంటి అనేక సర్వీసులు ప్రైవేటీకరణ చేయబడ్డాయి. దేశంలోనే అతి పెద్ద ఉద్యోగ నియామకదారు అయిన రైల్వేలలో ఇది జరుగుతున్నది.

ఇది కాకుండా టీచర్లు, డాక్టర్లు, సైంటిస్టులు, గణాంకశాస్త్రజ్ఞులు, ఆర్థికవేత్తలు లాంటి నైపుణ్యం కలిగిన ప్రొఫెషనల్ల పోస్టులు పెద్ద సంఖ్యలో ఖాళీగా ఉన్నాయి. టీచర్లను కాంట్రాక్టు ప్రాతిపదికన నియమిస్తూ నామమాత్రపు వేతనాలను విదిలిస్తున్నారు. వీటిలో సగం ఖాళీలు ఎస్‌సి, ఎస్‌టి, ఓబిసి, వికలాంగులు లాంటి రిజర్వుడు కేటగిరీలకు చెందినవే.

సంఘటిత రంగంలో అతిపెద్ద యజమాని అయిన ప్రభుత్వం ఉపాధి అవకాశాలను పెంచేందుకు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. 2010 నాటికి దేశం మొత్తం మీద 46 కోట్ల మంది పనిచేసే వారు ఉంటే, వారిలో 2.67 కోట్లమంది అంటే సుమారు 6 శాతం మంది మాత్రమే సంఘటిత రంగంలో ఉన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగంలో కలిపి సంఘటిత రంగంలో ఉపాధి కల్పన 2009లో 2.3 శాతం పెరగగా, 2010 లో 1.9 శాతం మాత్రమే పెరిగింది.

ఎంతో గొప్పగా చెప్పుకుంటున్న భారత దేశపు అభివృద్ధి రేటు బండారాన్ని ఇది బట్టబయలు చేస్తున్నది. అసమానతలో కూడిన అభివృద్ధి కావడం వల్లనే జిడిపిలో వ్యవసాయ రంగం వాటా 15 శాతానికి పడిపోయినప్పటికీ, 52 శాతం మంది ఆ రంగంపైనే ఆధారపడుతున్నారు. వ్యవసాయరంగంలోని మిగులు శ్రమశక్తిని ఇముడ్చు కోగలిగినంత ఉపాధిని పారిశ్రామిక, సేవారంగాల అభివృద్ధి కల్పించలేకపోతున్నది. ఇలాంటి ఉపాధి రహిత అభివృద్ధి పట్టణ గ్రామీణ ప్రాంతాల మధ్య అసమానతలను సృష్టిస్తున్నది, ఇంతకు మున్నెన్నడు లేనంతటి సామాజిక ఆర్థిక అసమానతలకు కారణమవుతున్నది.

ఇలాంటి నేపథ్యలో భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) నిరుద్యోగంతో సహా దేశం ముందున్న కొన్ని అత్యవసర సమస్యలపై ప్రచారోద్యమాన్ని చేపట్టింది. ఉత్తరాన అమృతసర్ నుండి, దక్షిణాన కన్యాకుమారి నుండి, పశ్చిమాన ముంబాయి నుండి, తూర్పున కలకత్తా నుండి నాలుగు జాతాలను ప్రారంభిస్తున్నది. ఈ జాతాలు మార్చి 19న ఢిల్లీలో సమీకృతమవుతాయి. ఆ రోజున ఢిల్లీలో బ్రహ్మాండమైన నిరసన సభ జరుగుతుంది. పెరుగుతున్న నిరుద్యోగాన్ని పెంచే, యువతలో అభద్రతను, దారిద్ర్యాన్ని పెంచే విధానాలకు మారుగా ప్రత్యామ్నాయ విధానాలను ఈ సభ డిమాండ్ చేస్తుంది.

## సిపిఐ(ఎం) ఈ క్రింది డిమాండ్లు చేస్తున్నది

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లోను, ప్రభుత్వ రంగ సంస్థల్లోను రిక్రూట్‌మెంట్లపై నిషేధాన్ని ఎత్తివేయాలి, ఖాళీ పోస్టులను రద్దుచేసే విధానాన్ని విడనాడి, అన్ని ఖాళీలను భర్తీ చేయాలి.
- నమోదు చేసుకున్న నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి అందించాలి, ఎంప్లాయ్‌మెంట్ ఎక్చేంజ్‌లను ఆధునీకరించాలి.
- కేవలం కుటుంబాలకే కాకుండా, వ్యక్తులందరికీ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని విస్తరించాలి, వంద రోజుల పరిమితిని ఎత్తివేయాలి.
- కనీస వేతనాలతో ఉపాధి హామీ పథకాన్ని పట్టణ ప్రాంతాలలోను ప్రారంభించాలి. మహిళలకు మూడింట ఒక వంతు ఉద్యోగాలను రిజర్వు చేయాలి.
- స్వయం ఉపాధి పథకాలకు, స్వయం సహాయక బృందాలకు, చిన్నతరహా సంస్థలకు ఆర్థిక మద్దతును అధికం చేయాలి.
- త్రైమాసిక జిడిపి అంచనాలతో పాటు ఉపాధి లెక్కలను కూడ విడుదల చేయాలి.

# 5. బాధ్యతాయుతమైన ఆరోగ్యవ్యవస్థను నిర్మించి, బలోపేతం చేయాలి.

దేశంలోని పౌరులందరికీ నాణ్యమైన ఆరోగ్యరక్షణకు హామీ కల్పించాలంటే ఏ వ్యవస్థకైనా ప్రజారోగ్యసేవలనేవి వెన్నెముక లాంటివి. ఇది జరగాలంటే దేశంలోని ప్రజారోగ్యసేవలను విస్తరించాలి, బలోపేతం చేయాలి. ప్రజారోగ్య వ్యవస్థ దేశంలో ఆరోగ్యసేవలు సమకూర్చడంలో ప్రధాన శక్తిగా ఉండాలి. అదే సమయంలో ప్రజాసేవలు అనేవి అవి సేవ చేస్తున్న సమూహాలకు, ప్రజలకు జవాబుదారీగా ఉండాలి. బలమైన, నమ్మకమైన ప్రజారోగ్యవ్యవస్థ ఉండటం నియంత్రణలేకుండా ప్రైవేటు రంగం పెరగడానికి అడ్డుకట్ట వేస్తుంది. ప్రైవేటు రంగంలో నీతిబాహ్యమైన పద్ధతులను అరికట్టడానికి దోహదపడుతుంది.

ఏకైక పరిష్కారం ఆరోగ్యరక్షణను బడా కార్పొరేట్ రంగానికి అప్పగించడమేనని ప్రభుత్వంలోని కొన్ని సెక్షన్లవారు వాదిస్తున్నారు. ఇలా వాదించేవారు, వాస్తవాలపై కాకుండా ప్రభుత్వ రంగం అనేది స్వభావరీత్యానే అసమర్థమైనదన్న సిద్ధాంతం ఆధారం చేసుకుంటున్నారు. **కాని ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ అనేవి రోగం కన్నా ప్రమాదకరమైన పరిష్కారాలు.**

**ఆరోగ్యరక్షణపై ప్రస్తుతమున్న జిడిపిలో 1 శాతం ప్రభుత్వ వ్యయాన్ని కనీసం 5 శాతానికి పెంచాల్సి ఉంది.** దీనికి మానవవనరులను కూడ నిరంతరంగా, గణనీయంగా తోడుచేయాల్సి ఉంది. దీనికి అదనంగా ప్రభుత్వ ఆరోగ్యవ్యవస్థను బలోపేతం చేయాలంటే అన్ని స్థాయిల్లోను వ్యవస్థాగతమైన కెపాసిటీలను పెంపొందించాలి.

## ప్రైవేటు రంగాన్ని నియంత్రించాలి

భారతదేశంలో ఆరోగ్యరక్షణ వ్యవస్థ ప్రపంచంలోనే అత్యధికంగా ప్రైవేటీకరించబడిన వాటిలో ఒకటి. ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహించడం అనే ప్రభుత్వ విధానం వల్ల ప్రత్యేకించి 1990ల తర్వాత ఆరోగ్యరక్షణ వ్యవస్థలోని వివిధ రంగాలలో **ప్రైవేటు రంగం పాత్ర** ఈ క్రింది విధంగా పెరిగింది:

| | |
|---|---|
| మెడికల్ గ్రాడ్యుయేట్లు | 90 శాతం |
| మెడికల్ కాలేజీలు | 30 శాతం |
| పోస్టుగ్రాడ్యుయేట్ డాక్టర్లు | 95 శాతం |
| ఔషధాల తయారీ | 99 శాతం |
| ఔట్‌పేషెంట్ కేర్ | 80 శాతం |
| మెడికల్ పరికరాల తయారీ | 100 శాతం |
| ఇండోర్ పేషెంట్లు | 40 శాతం |

భారీ ప్రైవేటు మెడికల్ రంగం పట్ల మన వైఖరిని నిర్దేశించుకోవడంలో మన ముందు రెండు అంశాలున్నాయి. ఒకటి, ప్రభుత్వ వనరులను ప్రైవేటు లాభాలను పెంచడానికి వినియోగించడం, రెండు, ప్రైవేటు వనరులను ప్రజల ప్రయోజనాలకు ఉపయోగపడేలా చేయడం. నేడు, మొదటి అంశమే ప్రధానంగా కనిపిస్తున్నది. ప్రభుత్వ నిధులతో ఏర్పాటు చేసే ఇన్సూరెన్స్ పథకాలు, వివిధ రకాలైన 'ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యాలు' లాంటి ముసుగులతో ఇది సాగుతున్నది. **ఈ నమూనాలన్నింటిలోను ప్రభుత్వ నిధులను ఎలాంటి సమర్ధవంతమైన నియంత్రణ, జవాబుదారీతనం, లేదా హేతుబద్ధీకరణ లేకుండా, ప్రజారోగ్య రక్షణ వ్యవస్థను మరింత బలహీనం చేసే విధంగా ప్రైవేటు మెడికల్ రంగానికి కట్టబెట్టడం జరుగుతున్నది.**

ప్రైవేటు రంగంలోని కొన్ని వనరులనయినా ప్రజాప్రయోజనం కోసం వినియోగించే ప్రత్యామ్నాయ వైఖరిని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. దీనికోసం కొన్ని రకాల ప్రైవేటు సరఫరాదారుల (లాభం కోసం కాని సరఫరాదారులతో సహా) నుండి ప్రజారోగ్య వ్యవస్థను బలోపేతం చేసే విధంగా, అదనంగా తోడుచేసే విధంగా సరఫరాలు స్వీకరించడాన్ని పెంపొందించాలి. అలాంటి సరఫరాదారులను వినియోగించుకునేటప్పుడు అవసరమైతే కొన్ని నియమాలు, నిబంధనలు విధించాలి. **ప్రైవేటు రంగంతో ఎలాంటి సంబంధం పెట్టుకోవాలన్నా దానికి ముందు సమగ్రమైన నియంత్రణ తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలి.**

## ఆరోగ్యబీమా : ఎవరికి లాభం?

కేంద్రంలో జాతీయ ఆరోగ్య బీమా పథకం, రాష్ట్రాల స్థాయిలో ఆంధ్రప్రదేశ్‌లో మాదిరి ఆరోగ్యశ్రీ ఆరోగ్య రక్షణ కోసం అయ్యే విపరీతమైన వ్యయాన్ని, ప్రత్యేకించి పేద, బలహీన వర్గాలకు తగ్గించేందుకు ప్రవేశపెట్టబడినాయి. ఇలాంటి పథకాలు కొద్దిమంది అర్హులైన వారికి లాభం చేకూర్చినప్పటికీ స్థూలంగా ఈ పథకాలు పటిష్టమైన ప్రజారోగ్య వ్యవస్థను అభివృద్ధి చేసి, కొనసాగించడానికి వ్యతిరేకంగా పనిచేస్తాయి. జాతీయ ఆరోగ్య బీమాను అమలు చేసే కేంద్ర కార్మిక శాఖ దాన్ని కార్మికులకు, పేదలకు అనుకూలమైన రీతిలో నడపాలని భావిస్తుంది. కాని వాస్తవంలో దీనికి పూర్తి విరుద్ధంగా జరుగుతున్నది. తగినంత వనరులతో, జవాబుదారీతనంతో పనిచేసే ప్రజారోగ్య వ్యవస్థ మాత్రమే నాణ్యమైన ఆరోగ్యరక్షణకు ఏకైక గ్యారంటీ. ఇన్సూరెన్స్ స్కీములు ఎలా పనిచేస్తున్నాయో సమగ్రంగా దర్యాప్తు జరపాలి. ప్రత్యేకించి ప్రభుత్వ వనరులను పిండుకోవడానికి అనైతిక పద్ధతులకు పాల్పడుతున్నాయని ఆరోపణలు వస్తున్న ప్రైవేటు ఆసుపత్రుల విషయంలో పరిశీలన జరగాలి. **ఈ దేశపు శ్రామికజనం కచ్చితంగా ఇంతకంటే మెరుగైనదానికి అర్హులు. ట్రేడ్‌యూనియన్లను, ప్రజాసంఘాలను దీనిలో కలుపుకోవాలి.**

## అందరికి ఔషధాలకు హామీ కల్పించాలి

దేశజనాభాలో 50 నుండి 80 శాతం మంది తమకు అవసరమైన అన్ని ఔషధాలను అందుకోలేకపోతున్నారు. మరోవైపున భారతదేశం ప్రపంచంలోనే 3వ అతి పెద్ద ఔషధతయారీదారు, 200 పైగా దేశాలకు ఔషధాలను ఎగుమతి చేస్తున్నది. దేశంలో ఔషధాలు అవసరమైన వారికి అందుబాటులో లేకపోవడం, దేశంలో తయారయిన ఔషధాలను ఇతర దేశాలకు ఎగుమతి చేయడం అనే పరిస్థితిని అనుమతించజాలం.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందరికీ ఉచితంగా ఔషధాలు అనే పథకాన్ని ప్రభుత్వం కొద్ది నెలల క్రితం ప్రకటించింది. స్వయంగా ప్రధాని చేసిన ఈ వాగ్దానం నుండి ఇప్పుడు ప్రభుత్వం దురదృష్టకరంగా వెనక్కి తగ్గుతున్నది. ఈ పథకాన్ని దేశవ్యాపితంగా అమలు చేయడానికి ముందు, ఇప్పటికే ఇలాంటి పథకాలు అమల్లో ఉన్న రాష్ట్రాల అనుభవాలను పరిగణనలోకి తీసుకోవాలి. తమిళనాడు మెడికల్ సర్వీసెస్ కార్పొరేషన్ ప్రభుత్వ ఆసుపత్రుల కోసం ఔషధాల సేకరణ, పంపిణీలకు పారదర్శకమైన పద్ధతులను అనుసరిస్తున్నది.

భారత దేశపు మార్కెట్‌లో నేడు 60 వేల నుండి 80 వేల వరకు పలు రకాల బ్రాండ్ల ఔషధాలు ఉన్నాయని అంచనా. వీటిలో చాలవరకు ప్రమాదకరమైనవి లేదా ఔషధ నియంత్రణ సంస్థల నుండి అనుమతి పొంది తయారు చేసిన పలు కాంబినేషన్లు. **అహేతుకమైన ఔషధాల తయారీని, అమ్మకాలను నిలిపి వేసేందుకు తక్షణం నికరమైన చర్యలు చేపట్టవలసి ఉంది. ఔషధాలను సహేతుకంగా వినియోగించేలా నియంత్రణ యంత్రాంగాన్ని పనిచేయించాల్సి ఉంది.**

1970 నుండి వరుసగా వెలువరించిన ఔషధ ధరల నియంత్రణ ఉత్తర్వుల (డిపిసిఏ) ద్వారా ఔషధ ధరలను నియంత్రించడానికి ప్రభుత్వం కొంత ప్రయత్నం చేసింది. అయితే 1995 డిపిసిఏ (అదే ఇప్పుడూ అమల్లో ఉంది) క్రిందకు వచ్చే ఔషధాల సంఖ్య 342 నుండి కేవలం 74కు పడిపోయింది. ఈ విధంగా నియంత్రణను దాదాపు పూర్తిగా ఎత్తివేసిన ఫలితంగా ఔషధాల రీటైల్, బల్క్ అమ్మకాల ధరల మధ్య విపరీతమైన వ్యత్యాసం ఉంటున్నది. అది 100 శాతం నుండి 5600 శాతం వరకు ఉంటున్నది. శరద్ పవార్ నాయకత్వంలోని మంత్రుల బృందం అన్ని రకాల అత్యవసర ఔషధాల ధరలను మార్కెట్ ఆధారంగా నిర్ణయించాలని ఇటీవల సిఫార్సు చేసింది. ఈ సిఫార్సు సుప్రీం కోర్టు అభిప్రాయాన్ని ఉల్లంఘించింది. నేడు కొనసాగుతున్న అదుపు లేని ఔషధ ధరలను ఈ సిఫార్సు చట్టబద్ధం చేస్తుంది. **అన్ని అత్యవసర ఔషధాలను (ప్రస్తుతం 348) వాటి కాంబినేషన్లను ఉత్పత్తి ఖర్చు ఆధారిత ధరల నియంత్రణ క్రిందకు తీసుకురావాలి.**

2005 భారత పేటెంట్ చట్టంలో మార్పు భారత కంపెనీలకు అందుబాటులో ఉన్న విలువైన సాధనాన్ని దూరం చేసింది. ఇటీవల కాలంలో భారత చట్టంలో ఆరోగ్య రక్షణలను వినియోగించుకునే పలు సానుకూలమైన తీర్పులు వెలువడినాయి. దీనిలో క్యాన్సర్ ఔషధం సోరాఫెనిబ్‌కు మొదటి కంపల్సరీ లైసెన్స్ జారీ కూడ ఉంది, అంటే ఒక విదేశీ కంపెనీ తయారు చేసిన పేటెంట్ ఔషధాన్ని భారత కంపెనీ తయారు చేయడానికి లైసెన్స్. కాని 2005 పేటెంట్ చట్ట సవరణ తర్వాత హెపటైటిస్-సి ఔషధం పెగ్ ఇంటెర్‌ఫెరాన్‌కు ఇచ్చిన మొదటి డ్రగ్ పేటెంట్ రద్దుచేయబడింది. ఇలాంటి సానుకూల విజయాలు ఉన్నప్పటికీ, నేడు అనేక కొత్త ఔషధాలకు పేటెంట్లు మంజూరుచేయబడుతున్నాయి. ఫలితంగా ఆ మందులు దాదాపు భారత ప్రజల మొత్తానికి అందుబాటులో లేకుండా పోతున్నాయి. భారత చట్టంలోని సానుకూల అంశాలను వమ్ముచేయడానికి బహుళజాతి సంస్థలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. భారత చట్టంలోని ఓ కీలక అంశానికి వ్యతిరేకంగా స్విట్జర్లాండ్‌కు చెందిన నోవార్టిస్ కంపెనీ సుప్రీం కోర్టులో కేసు నడుపుతూనే ఉన్నది. స్వతంత్రంగా కాని, స్వేచ్ఛా వాణిజ్య

ఒప్పందాల్లో భాగంగా కాని, మరింత పటిష్టమైన పేటెంట్ వ్యవస్థను ఐరోపా యూనియన్, అమెరికాలు డిమాండ్ చేస్తున్నాయి. **భారత పేటెంట్ చట్టంలోని ఆరోగ్య రక్షణలను రక్షించుకోవడంలో ప్రభుత్వం గట్టిగా నిలబడాలి, పేటెంట్స్ అనేవి ఔషధాల లభ్యత అవరోధంగా మారకుండా చర్యలు తీసుకోవాలి.**

## అత్యంత బలహీన వర్గాల అవసరాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి

ప్రత్యేక ఆరోగ్య అవసరాలు ఉన్న వారికి, అత్యంత బలహీన వర్గాలకు చెందిన వారికి ప్రాధాన్యత ఇచ్చేవిధంగా ఆరోగ్యవ్యవస్థను మార్పుచేయాల్సి ఉంది. మహిళలు, బాలలు, వృద్ధులు ఆరోగ్య రక్షణలు పొందడంలో అసమానతలకు గురవుతున్నారు. వీరికి ప్రత్యేకమైన ఆరోగ్య అవసరాలు ఉండటం, సామాజిక దొంతరలు, అధికార వ్యవస్థలు దీనికి కారణం. నేడు హెచ్ఐవి/ఎయిడ్స్‌తో జీవించేవారు, మానసిక వికలాంగులు తీవ్రమైన వివక్షతకు గురవుతున్నారు. ఇది వారి ఆరోగ్య సమస్యలను తీవ్రతరం చేస్తున్నది. వారి ఆరోగ్య హక్కులు అనేక రకాలుగా ఉల్లంఘించబడటానికి ఇది దారి తీస్తుంది. దళితులు, ఆదివాసీలు చారిత్రకంగా తీవ్రమైన సామాజిక వివక్షకు గురవుతున్నారు, ఇది ఆరోగ్యహక్కులు వారికి నిరాకరించడంలో కూడ ప్రతిబింబిస్తుంది. వలస కార్మికులు, అసంఘటిత కార్మికులు, నిర్వాసితులు, సంఘర్షణల ప్రాంతాలలో ఉండేవారు, విభిన్న లైంగిక అలవాట్లు కలిగిన వారు – తీవ్రమైన అసమానతలకు గురవుతున్నారు. అందుచేత వారికి ఆరోగ్య హక్కులు గ్యారంటీ కల్పించబడాలి.


ప్రచురణ కాలం : ఫిబ్రవరి, 2013

వెల : ₹ 3

ప్రచురణ

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు), ఆంధ్రప్రదేశ్ కమిటీ

ప్రతులకు

ప్రజాశక్తి బుక్‌హౌస్

*ఎమ్.హెచ్.భవన్, ప్లాట్ నెం. 21/1, అజామాబాద్, ఆర్‌టిసి కళ్యాణమండపం దగ్గర*

*హైదరాబాద్ - 20, ఫోన్ : 040-27660013, ఫాక్స్ : 040 -27635136*

*బ్రాంచీలు : హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్టణం, తిరుపతి, ఖమ్మం, హన్మకొండ, నల్గొండ, గుంటూరు, ఒంగోలు*

*ముద్రణ : ప్రజాశక్తి ప్రింటింగ్ ప్రెస్, హైదరాబాద్*